Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 11 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 ఫిబ్రవరి 2024 ఆదివారం పేజీలు : 4

### మళ్లీ పెరిగిన టమోటా ధర.. కిలో ఎంతంటే..

బెంగళూరు : టమోటా ధరలు మళ్లీ పెరిగాయి. హొసూరు ప్రాంతాలో టమోటా కిలో రూ. 40కు పైగా విక్రయిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హొసూరు, డెంకణీకోట, శూలగిరి, బాగలూరుతో పాటు వేలాది ఎకరాలలో రైతులు పెద్ద ఎత్తున కూరగాయలు, పండిస్తుంటారు. అలాగే హొసూరు నుంచి రాజస్థాన్‌కు, గుజరాత్‌కు 100 నుంచి, 125 లారీల టమోటాలు పంపుతున్నారు. ఈ దశల్లో టమోటా ధర రూ. 20 నుంచి, కిలో రూ. 40 కు పలకడంతో ఆనందం చెందుతున్న రైతులు, ఒక బాక్సు రూ. 800 నుంచి, రూ. 850కు విక్రయిస్తున్నారు. పలు రాష్ట్రాలకు, జిల్లాలకు ఎగుమతి చేస్తున్నారు. రైతులు ఈ విషయంపై మాట్లాడుతూ ఉన్నట్టుండి, ధరలు పెరుగుతుండడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.




# 'జంపింగులు'

## బీఆర్ఎస్‌కు ఇదే గుబులు!

## సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యేల వరుస భేటీలతో అయోమయం!

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మరోసారి కుదుపు ఏర్పడనుందా? కీలకమైన పార్లమెంటు ఎన్నికలకు ముందు.. జంపింగులు తెరమీదికి వస్తాయా? అధికార పార్టీ కాంగ్రెస్ దూకుడుతో బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు.. పక్క చూపులు చూస్తున్నారా? అంటే.. తాజాగా జరుగుతు న్న పరిణామాలను గమనించిన వారు.. ఔనని.. కొందరు కాదని వ్యాఖ్యానిస్తున్నారు. వరుసగా బీఆర్ ఎస్ నాయకులు నేరుగా సీఎం రేవంత్‌తో భేటీ అవుతున్నారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగి పట్టుమని రెండు మాసాలు కూడా కాకుండానే బీఆర్ ఎస్ పక్షాన గెలిచిన ఎమ్మెల్యేలు ఇలా సీఎం రేవంత్‌తో భేటీ కావడం వెనుక విషయం ఏదున్నా.. రాజకీయంగా మాత్రం ఏదో జరుగుతోందనే వాదన వినిపిస్తోంది. ఇటీవలే.. బీఆర్ ఎస్‌కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. నరసాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు సీఎం రేవంత్‌తో గంటకు పైగా భేటీ అయ్యారు. వీరికి సీఎం రేవంత్ తేనీటి విందు ఇచ్చారు. అయితే.. వీరు ఏం చర్చించారన్న విషయంపై అనేక ఊహాగానాలు వచ్చాయి. కేవలం అభివృద్ధి కోసమే.. తాము సీఎంను కలిశామని వారు తర్వాత వివరణ ఇచ్చుకున్నారు. కానీ, పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ ఎస్ అభివృద్ధి చేశామని చెబుతున్నప్పుడు పట్టుమని రెండు నెలలు కూడా కాని కొత్త ప్రభుత్వంతో వీరు అభివృద్ధిపై చర్చలు జరుపుతారా? అనేది సందేహం. ఇక, ఇప్పుడు తాజాగా.. మరో ఎమ్మెల్యే కూడా సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. యథాలాపంగా ఈయన కూడా తన నియోజకవర్గం అభివృద్ధి కోసమే వచ్చానని చెప్పుకొచ్చారు. పైన వచ్చిన డౌటే.. ఈయన విషయంలోనూ వచ్చింది. ఇదిలావుంటే.. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మధు యాష్కీ సంచలన ప్రకటన చేశారు. వాళ్లంతా తమ పార్టీలోకి వచ్చేయడానికి రెడీగా ఉన్నారని.. కానీ, తామే వారిని నిలువరిస్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు. నిప్పులేందే పొగరాదన్నట్టుగా.. జంపింగుల ఉద్దేశం లేకుండా.. ఏనేతా ఇంత హడావుడిగా ప్రత్యర్థి పార్టీ సీఎంను కలుసుకునేందుకు సాహసం అయితే చేయరని పరిశీలకులు అంటున్నారు. ఇక, రాజకీయ వాతావరణాన్ని పరిశీలిస్తే.. రాష్ట్రంలో త్వరలోనేపార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ గాలి జోరుగా వీస్తున్నందున.. ఈ పార్టీ భారీగానే ఆశలు పెట్టుకుంది.

ఉచిత బస్సు ప్రయాణం సహా ఇతర పథకాలు తమకు లాభిస్తాయని అనుకుంటోంది. దీనిని పరిశీలకులు కూడా అంగీకరిస్తున్నారు. ఈ క్రమంలోనే పలువురు బీఆర్ ఎస్ నేతలు.. పార్టీ మారేందుకు సిద్ధపడుతున్నారా? అనే చర్చ జోరుగా సాగుతోంది. పైకి వారు కాదని అంటున్నా.. లోపల మాత్రం తేడాగానే ఉన్నారనేది విశ్లేషకుల మాట. చూడాలి.. మరి ఏం జరుగుతుందో. మరోవైపు.. బీఆర్ ఎస్‌లోనూ ఈ విషయం చర్చకు వస్తోంది. ఉండేవారు.. ఎవరు? వీడేవారు ఎవరు? అనేది గుబులు రేపుతోంది.

## సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు భయపడుతున్నారు?: కేటీఆర్

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమీ రాలేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగినా సీఎం రేవంత్ రెడ్డి స్పందించడం లేదని మండిపడ్డారు. భాజపాకు వ్యతిరేకంగా సీఎం ఒక్క మాటా మాట్లాడడం లేదన్నారు.



"తెలంగాణ సీఎం ఎందుకు భయపడుతున్నారు? రాష్ట్ర ప్రయోజనాలను ఎందుకు పణంగా పెడుతున్నారు? కృష్ణా బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించి రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారు" అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ఆయన ఓ ఫొటో షేర్ చేశారు.



## కరెంట్ కనెక్షన్‌కు సెల్ ఫోన్ నంబర్ అనుసంధానం

హైదరాబాద్: టెక్నాలజీ పెరిగిపోయిన ప్రస్తుత కాలంలో ప్రతి దానికి మొబైల్ నంబర్‌ను అనుసంధానం చేస్తున్నారు. ఉదాహరణకు బ్యాంకు అకౌంట్, గ్యాస్ బుక్, వైఫై అకౌంట్, ఆధార్ కార్డు వంటి అనేక వాటికి మొబైల్ నంబర్ కచ్చితంగా అనుసంధానం చేస్తున్నారు. దీని ద్వారా సంబంధిత సమాచారాన్ని వినియోగదారుల మొబైల్ ఫోన్లకు సందేశం రూపంలో పంపిస్తున్నారు. ముఖ్యంగా బ్యాంకు అకౌంట్ల విషయంలో మొబైల్ నంబర్ల అనుసంధానం కీలకపాత్ర పోషిస్తున్నాయి. అకౌంట్లో డబ్బులు వేసిన, తీసిన వెంటనే మొబైల్ నంబర్‌కు సందేశం వస్తుంటుంది. ఈఎంఐ, ట్రాఫిక్ చలాన్లు వంటి వివరాలు కూడా మొబైల్ నంబర్లకు సందేశం రూపంలో వస్తుంటాయి.

దీంతో వినియోగదారులు అప్రమత్తమై తమ బిల్లులను చెల్లించేందుకు వీలుటుంది. ప్రస్తుతం తెలంగాణ విద్యుత్ శాఖ కూడా ఆ దిశగా కసరత్తులు మొదలుపెట్టింది. ఇకపై కరెంట్ బిల్లుకు సంబంధించిన వివరాలను సందేశం రూపంలో వినియోగదారుల మొబైల్ నంబర్లకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో కరెంట్ కనెక్షన్ ఉన్న ప్రతి వినియోగదారుడు తమ ఫోన్ నంబర్‌ను విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో అందజేయాలని అధికారులు చెబుతున్నారు. మొబైల్ నంబర్‌ను కరెంట్ కనెక్షన్‌కు అనుసంధానం చేయాలని కోరుతున్నారు. తద్వారా కరెంట్ బిల్లు వివరాలను ఎప్పటికప్పుడు వినియోగదారుల మొబైల్స్‌కు సందేశం రూపంలో పంపనున్నట్టు విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) తెలిపింది. కొందరి ఫోన్ నంబర్లు అందుబాటులో లేకపోవడంతో సందేశాలు వెళ్లడం లేదని అధికారులు తెలిపారు.

## ఇలా అవుతుందని కలలో కూడా ఊహించలేదు..

కరీంనగర్, ఫిబ్రవరి 3: తెలంగాణలో బీఆర్ఎస్ ఓడిపోతుందని కలలో కూడా ఊహించలేదని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. గాలికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గాలిలోనే కలిసిపోతుందని వ్యాఖ్యలు చేశారు. పద్దెనిమిదేళ్ళ పాటు పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని



సాధించుకున్నామన్నారు. తాగునీరు, సాగునీరు అందించి, దేశానికి అన్నం పెట్టే రైతన్నను తయారు చేసిన నాయకుడు కేసీఆర్ అని చెప్పుకొచ్చారు. 56 ఏళ్ళ పాలించిన కాంగ్రెస్ పార్టీ ఈ దేశ ప్రజలకు ఏం చేసిందని ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీకి 40 సీట్లు కూడా వచ్చే అవకాశం లేదని ఎమ్మెల్యే మల్లారెడ్డి పేర్కొన్నారు.




# రేవంత్ ఎఫెక్ట్‌తో...

## పార్లమెంటు ఫైట్ తెలంగాణలో..

# ఏకపక్షమేనా?

హైదరాబాద్ : త్వరలోనే జరగనున్న పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి తెలంగాణ రాజకీయాలు హీటెక్కాయి. అధికార పక్షం కాంగ్రెస్.. రెండు మాసాల ముందుగానే ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవల్లి వేదికగా ప్రచార పర్వాన్ని ప్రారంభించింది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. పార్లమెంటు నుంచి నరుక్కొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

రాష్ట్ర సమస్యలను, ముఖ్యంగా జలవివాదాలను పార్లమెంటులో ప్రస్తావించడం ద్వారా.. రాష్ట్రంపై తమకు ఉన్న విజన్‌ను ఆయన ప్రచారాస్త్రంగా మలుచుకునే ప్రయత్నం ప్రారంభించారు. ఇక, బీజేపీ కూడా ఈ ఎన్నికలపై ఫోకస్ చేయనున్నప్పటికీ.. ఇంకా ఏమీ ప్రారంభించలేదు. మరో పార్ట ఎంఐఎం.. కూడా అలానే ఉంది. అయితే.. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రధానంగా రేవంత్ హవా పెద్దగా కనిపిస్తుందనే చర్చసాగుతోంది. తాజాగా నిర్వహించిన ఇంద్రవెల్లి సభకు పోటెత్తిన ప్రజలను చూస్తే.. ఏకపక్షంగా మారినా సందేహం లేదని పరిశీలకులు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. "తొలి సభ అదిరిపోయింది" అని ఒక మంత్రి వ్యాఖ్యానించారు. ఇక, సభా వేదికపైనే రేవంత్ .. అనేక హామీలను అమలు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే ఆయన ప్రస్తావించినా.. వాటిని త్వరలోనే అమలు చేస్తామని చెప్పడంతో సభలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

ఇక, ఇప్పటికే అమలు చేస్తున్న కీలకమైన పథకం.. మహాలక్ష్మి. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. ఇది కాంగ్రెస్‌కు బాగా కలిసి వస్తుందని ప్రచారం జరుగుతోంది. ఇక, ఇప్పుడు రూ. 500లకే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు అందివస్తే.. ఒక రేంజ్‌లో రేవంత్ ప్రభ వెలిగి పోవడంఖాయమని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే.. ఇదొక మహోగ్రంగా సాగినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. ఏకపక్షంగా రేవంత్ ఫేస్ వాల్యూతో నెట్టుకొచ్చేసినా.. సందేహం లేదని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఎవరు? అనేది పార్టీప్రకటించలేదు.

దీంతో సందేహంగానే కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఓట్లు పడ్డాయి. చాలా మంది బీఆర్ ఎస్ ఎమ్మెల్యే వెయ్యి లోపు మెజారిటీనే దక్కించుకున్నారు. ఇక, ఇప్పుడు సీఎం రేవంత్ వచ్చీరావడంతోనే తీసుకున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాలతో బీఆర్ ఎస్ పార్టీకి ఇబ్బంది తప్పదని అంటున్నారు పరిశీలకులు. మరి ఈ పద్మవ్యూహాన్ని కేసీఆర్ ఎలా ఛేదిస్తారో చూడాలి.

# సంపాదకీయం

## బడ్జెట్ లో మాల్దీవులకు సాయం.. మేధావులు ఇప్పుడేమంటారు?

తన బడ్జెట్ తో మేధావులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ షాకిచ్చారా? అంటే కొంతమేర అవునని చెప్పాలి. విదేశీ వ్యవహారాల విషయంలో తనదైన మార్కు వేస్తున్న మోడీని అభినందించే వారు ఎంతమంది ఉంటారో.. అదే స్థాయిలో మరికొందరు మోడీ తీరును తప్పు పట్టేటోళ్లు ఉంటారు. సామాన్యుల కంటే మేధావులుగా పేర్కొనే పలువురు మోడీ సర్కారు అనుసరించే విదేశాంగ తీరుపై పెదవి విరుస్తూ ఉంటారు. వారిలో ఎక్కువగా వామపక్ష భావజాలానికి దగ్గరగా ఉండేవారే కనిపిస్తారు. మోడీ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. తన చుట్టుపక్కల ఉన్న పలు దేశాలతో సత్ సంబంధాలు కొనసాగించటం లేదని.. ప్రతి ఒక్కరితోనూ పేచీలు పెట్టుకుంటుందన్న వాదనను వినిపిస్తారు. మరి.. మోడీకి ముందు జరిగిందేంటి? అన్నది చూస్తే.. చిన్న దేశం సైతం తోక జాడించేది. ప్రతిఒక్కరితోనూ వారేం చేసినా భరిస్తూ.. దానికి సహనం ఎక్కువన్న ట్యాగ్ వేసుకొని భరించే పరిస్థితి. దీనికి కాస్త భిన్నంగా మోడీ సర్కారు తీరు ఉంటుంది. నువ్వు బాగుంటే నేను బాగుంటా? నువ్వు తేడా చేస్తే నేను అంతకు మించి చేస్తానన్నట్లుగా కాస్తంత నిక్కచ్చిగా ఉండటం కనిపిస్తుంది. ఈ మధ్యన మాల్దీవుల మంత్రుల అసందర్భ ప్రేలాపనల పై సామాన్య ప్రజలు ఒకలా స్పందిస్తూ.. కొందరు మేధావులు మాత్రం మరోలా రియాక్టు అయ్యారు. దేశ ప్రధానమంత్రిని పట్టుకొని అన్నేసి మాటలు అంటున్నా వారికి పట్టలేదు. అదేమంటే.. మీరంతా మోడీ భక్తులలంటూ మద్దతుగా నిలిచిన వారిని తూలనాడారు. అంతేతప్పించి మోడీ వ్యతిరేక ఎజెండా పెట్టుకొని మరీ ఎన్నికల్లో దిగి.. విష ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన వ్యక్తికి మద్దతుగా మాట్లాడే మేధావుల తీరును ఏమని చెప్పాలి? ఎలా చూడాలి? ఇలాంటి సూడో మేధావులకు తనదైన రీతిలో నిర్ణయాన్ని ప్రకటించటం ద్వారా నోట మాట రాకుండా చేశారు మోడీ. తాజా బడ్జెట్ లో మాల్దీవులకు ఆర్థిక సాయం కింద రూ.600 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 50 శాతం ఎక్కువ. దీని ద్వారా మోడీ సర్కారు స్పష్టంగా చెప్పిన అంశం ఒక్కటే. తాము మాల్దీవుల ప్రజలకు ఏ మాత్రం వ్యతిరేకం కాదని. 2023 బడ్జెట్ లో మాల్దీవుల డెవలప్ మెంట్ కు భారత్ రూ.400 కోట్లు ఇవ్వాలని నిర్ణయించినా.. సవరించిన అంచనాలతో రూ.770 కోట్లు ఖర్చు చేసింది. ఆ మొత్తంతో పోలిస్తే తాజా కేటాయింపులు తక్కువగా అనిపించినా.. చివర్లో సవరింపులు చేస్తే మరింత పెరిగే వీలుంది. ఇరుగుపొరుగు దేశాలతో బంధాన్ని బలోపేతం చేయటానికి తమ ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరిస్తుందన్న విషయాన్ని తాజా కేటాయింపుతో చెప్పేశారని చెప్పాలి. ఇరుగుపొరుగు దేశాలతో పంచాయితీ తప్పించి.. స్నేహంగా ఉండరంటూ వాదనలు వినిపించే మేధావులకు మోడీ సర్కారు బడ్జెట్ కేటాయింపులు కాస్తంత కంటగింపుగా మారే వీలుంది.

## ఘనంగా అట్టహాసంగా నక్క ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలు







శామీర్ పేట, (గరుడ వార్త) : కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా అట్టహాసంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రం శామీర్ పేట లోని ఎన్ పి జి వెంచర్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ 57వ జన్మదిన వేడుకలను కార్యకర్తలు, నాయకుల తో కలిసి జరుపుకున్నారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యేలు మలిపెద్ది సుధీర్ రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ లు విచ్చేసి నక్క ప్రభాకర్ గౌడ్ ను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నక్క ప్రభాకర్ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రత్యేక అధికారులు సమర్ధవంతంగా సేవలు అందించాలి...

### జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) దిశానిర్దేశం.






జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లో సర్పంచ్ల పదవీ కాలం ముగిసినందున గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియామకమైన స్పెషల్ ఆఫీసర్లు తమ బాధ్యతలను గుర్తెరిగి ప్రజలకు సమర్ధవంతంగా సేవలందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసూరి అనసూయ (సీతక్క) సూచించారు. పంచాయతీరాజ్ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావు లతో కలిసి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, సంబందిత శాఖల అధికారులు, గ్రామ పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ కూడా వీడియో కాన్ఫరెన్సు పాలొగొన్నారు. ఈ కాన్ఫరెన్స్లో మంత్రి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ... రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లో సర్పంచ్ల పదవీకాలం ముగిసిన నేపద్యంలో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించిందని వారు అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన స్థాయిలో సేవలు అందించాలన్నారు . ఆయా గ్రామాల్లోని ప్రత్యేక అధికారులకు వారి అధికారాలు, బాధ్యతల గురించి పరిపూర్ణంగా తెలియజేసేందుకు వీలుగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్లకు మంత్రి తెలిపారు అలాగే రానున్న వేసవి కాలం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని మంత్రి అనసూయ తెలిపారు. దీంతో పాటు ముఖ్యంగా ఈ నెల 7వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టి పల్లెలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టి ఆదర్శంగా నిలిచిన ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి పండుగ వాతావరణంలో సన్మానించాలని కలెక్టర్లకు వివరించారు. యువత, మహిళలను స్పెషల్ డ్రైవ్ లో పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని, యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారకుండా గ్రామ ప్రగతిలో మమేకం అయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. నాగోబా, మేడారం వంటి జాతరలు జరిగే ప్రదేశాలలో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేలా, తద్వారా ప్రకృతి పర్యావరణానికి హాని కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ పథకాల పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని అన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ప్రణాళిక ప్రకారం ప్రత్యేక అధికారులు విధులు నిర్వహించాలి...

### తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికాబద్దంగా వ్యవహరించాలి : జిల్లా అధికారులతో కలెక్టర్ గౌతమ్



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు తమ విధులను ఎంతో బాధ్యతాయుతంగా సక్రమంగా నిర్వహించాలని, అందుకోసం ప్రణాళిక సిద్దం చేసుకోవాల ని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. రాష్ట్ర మంత్రి అనసూయ (సీతక్క) నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ గౌతమ్, గ్రామ పంచాయతీల స్పెషల్ అధికారులుతో, మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రత్యేక అధికారులు తమ విధులను ఎంతో జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా నడుచుకోవాలని ఈ విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఉండాల్సిందిగా కలెక్టర్ సూచించారు. దీంతో పాటు ఈనెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ (ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం) విజయవంతమయ్యేలా ఇప్పటి నుంచే అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి యువతను ప్రోత్సహించి వారిని భాగస్వామ్యం చేసి సమన్వయంతో విజయవంతం చేయాల్సిందిగా కలెక్టర్ గౌతమ్ అధికారులకు వివరించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం ప్రత్యేక అధికారులు పని చేయాలని... వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. గ్రామపంచాయతీలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఉపాధి హామీ కూలీల శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీల స్పెషల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తోటి మిత్రుడి కుటుంబానికి సుమారు లక్ష రూపాయల ఆర్థిక సహాయం...

శామీర్ పేట, (గరుడ వార్త) : తమతో చదివిన మిత్రుడు ఆకస్మికంగా మృతి చెందడంతో అతని కుటుంబానికి సుమారు లక్ష రూపాయల మేర ఆర్థిక సహాయం చేసి వారి గొప్ప మనసును చాటుకున్న మిత్రులు. తనతో చదివిన మిత్రుడు కుటుంబానికి తోటి మిత్రులు ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. మండలంలోని అలియాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000- 2001 సంవత్సరం పదో తరగతి చదివిన



బ్యాచ్ కి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి గత నెల 19న ఆకస్మికంగా గుండె నొప్పితో మృతి చెందాడు. ఆ సంవత్సరం చదివిన విద్యార్థిని, విద్యార్థులు రూ. 80,000 నగదు తో పాటు ఆరు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను మూడు చింతలపల్లి మండలం జగన్ కూడా గ్రామంలోనీ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు, నిత్యవసర సరుకులను అందజేశారు.

## 22 నుంచి 26 వరకు బెంగళూరులో ఇండియా వుడ్ 2024

హైదరాబాద్ : బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ లో ఉడ్ వర్కింగ్, ఫర్నీచర్ ప్రొడక్షన్ టెక్నాలజీపై 'ఇండియా వుడ్ 2024' ఫిబ్రవరి 22 నుంచి 26వ తేదీ వరకు జరగనుంది. ఇది ఇండియా వుడ్ 13వ ఎడిషన్. ఈ ప్రదర్శనలో 950 పైగా కంపెనీలు, 50 పైగా దేశాల నుంచి 75 వేలకు పైగా వాణిజ్య సందర్శకులు విచ్చేయనున్నారు. ఇది 75 వేల స్క్వేర్ మీటర్ల ఎగ్జిబిషన్ ప్రాంతం. ఈ ఈవెంట్ తాజా ఆవిష్కరణలు, సాంకేతికతపై ఒక అవగాహన అందిస్తుంది. ఎన్నో నెట్వర్కింగ్ అందిస్తుంది.అవకాశాలను కూడా ఇండియా వుడ్ 2024 అనేది ఈవెంట్ చరిత్రలో అతిపెద్దది. ప్రపంచంలో ఉన్న పరిశ్రమ నాయకులు, సాంకేతికత సరఫరాదారులు, కొనుగోలుదారులను ఒకచోట చేర్చుతుంది. ఇది నిపుణులు, ఆలోచనా నాయకుల నేతృత్వంలోని సెమినార్లు, వర్క్షాప్లు, ప్యానెల్ చర్చల సమగ్ర లైనపన్ను కలిగి ఉంది. అత్యాధునిక మెషినరీ, టెక్నాలజీ, మెటీరియల్స్, సామాగ్రి, ఫిట్టింగ్లు, హార్డ్వేర్, కాంపోనెంట్లు, పరిశ్రమ సేవలు కలవు.

## టీపీటీఎఫ్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చెయ్యండి.

### భూక్య సారంగపాణి, టిపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి.

ఏటూరునాగారం, ఫిబ్రవరి 03 :ఫిబ్రవరి 11,12 వ తేదీలలో ఖమ్మం జిల్లాలో జరిగే తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చెయ్యాలని టీపీటీఎఫ్ ఏటూరునాగారం మండల ప్రధాన కార్యదర్శి భూక్య సారంగపాణి పిలుపు నిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఖమ్మంలో జరిగే మహాసభలకు ముఖ్య అతిథులుగా ఉపముఖ్యమంత్రి మల్లు



బట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్, తుమ్మల నాగేశ్వర్ రావు హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అనేక సామజిక సాంస్కృతిక సమసమాజ నిర్మాణం కోసం ప్రముఖ మేధావుల చేత ఉపన్యాసాలు ఉంటాయి అన్నారు. కావున ఉపాధ్యాయులు, విద్యావంతులు, మేధావులు, అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చెయ్యాలని కోరారు.

## LK అద్వానీ కి భారతరత్న ప్రకటన

### హర్షం ప్రకటించిన బిజెపి జిల్లా అధ్యక్షులు కేవీ రంగాకిరణ్

కొత్త గూడెం,ఫిబ్రవరి03: భారత ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ కి భారత ప్రభుత్వం భారతరత్నను ప్రకటించిన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం బిజెపి జిల్లా అధ్యక్షులు కేవీ రంగా కిరణ్, హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ దేశంలో అత్యుత్తమైన భారతరత్న అవార్డు కు ఎల్కే అద్వానీకి ప్రకటించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. రథయాత్రల ద్వారా బిజెపి పార్టీ శ్రేణులను చైతన్య పరచడంలో వారి పాత్ర మరువలేనిదని,. దేశంలోని హిందువులందరినీ ఏకం చేస్తూ దేశ సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో



ఆయన కీలక పాత్ర పోషించారు. బిజెపి పార్టీని రెండు సీట్ల నుండి అధికారంలోకి వస్తామని విశ్వాసాన్ని కలిగించడంలో సఫలీకృతులయ్యారు. వారు ఇచ్చిన మనోధైర్యంతో బిజెపి నేడు అధికారంలోకి రావడం జరిగిందని అన్నారు. భారత ఉప ప్రధానిగా మరియు కేంద్ర హోంశాఖ మంత్రిగా ఈ దేశానికి సేవలందించారు. వారు ఈ దేశానికి చేసిన సేవను గుర్తించి భారత ప్రభుత్వం భారతరత్న అవార్డు ను ప్రకటించడం భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

# పదవుల కోసం ముమ్మర ప్రయత్నాలు

భువనగిరి : పుర పాలకుల ఎన్నికలకు ప్రధాన రాజకీయ పక్షాలు పావులు కదుపుతున్నాయి. భువనగిరి పుర పాలకులపై ఇటీవల ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ప్రధాన రాజకీయ పార్టీల ఆశావహులు పదవులను దక్కించుకునేందుకు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. భారాస, కాంగ్రెస్, భాజపాల్లోని ఆశావహులు తమకు అనుకూలంగా ఉన్న కౌన్సిలర్లతో కలిసి పదవులు దక్కించుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రస్తుతం పాలకవర్గంలో తిరుగుబాటు కౌన్సిలర్లతో కలుపుకొని కౌన్సిల్‌లో భారాసకు 20 మంది సభ్యుల బలం ఉంది. కాంగ్రెస్‌కు తొమ్మిది మంది, భాజపాకు ఆరుగురు ఉన్నారు. ఇటీవల ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా పేరును నమోదు చేసుకోవడంతో కౌన్సిల్‌లో సభ్యుల సంఖ్య 36కు పెరిగింది. అవిశ్వాసం నెగ్గడంతో ప్రక్రియ ఆమోదానికి కలెక్టర్ దస్త్రాన్ని ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం ఆమోదించిన తదుపరి గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేస్తూ, పుర అధ్యక్షుడు, వైస్ ఛైర్మన్ ఎన్నికలు నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాల్సి ఉంది. ప్రభుత్వ నివేదిక ప్రకారం ఎన్నికల కమిషన్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక తేదీని ఖరారు చేసి ఎన్నిక నిర్వహించాలని కలెక్టర్‌ను ఆదేశించనుంది.



ప్రలోభాలతో ఎర...నల్గొండ పురపాలక సంఘం ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక తేదీ ఖరారు కావడంతో అవిశ్వాసం నెగ్గిన పురపాలక సంఘాల్లో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమైంది. త్వరలోనే ఆయా పురపాలక సంఘాల్లో ఎన్నిక ప్రక్రియ జరగనుంది. భువనగిరి పురపాలక సంఘం అధ్యక్ష పదవికి భారాస తిరుగుబాటు కౌన్సిలర్ ఖాజా అజీమొద్దీన్, కాంగ్రెస్ నుంచి తంగెళ్లపల్లి శ్రీవాణి, పోత్నక్ ప్రమోద్‌కుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, భాజపా నుంచి మాయ దశరథ ఆశిస్తున్నారు. ఛైర్మన్ పదవి దక్కని పక్షంలో వీరిలో ఎవరో ఒకరు వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఛైర్మన్ ఎన్నిక సమావేశానికి 19 మంది కౌన్సిలర్లు హాజరైతే ఎన్నికల అధికారి సమావేశాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. భారాస తిరుగుబాటు కౌన్సిలర్లతో పాటు మరో నలుగురు సభ్యులు సమావేశానికి హాజరైన పక్షంలో సునాయాసంగా భారాస ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను కైవసం చేసుకునే అవకాశం ఉంది. లేకుంటే తిరుగుబాటు కౌన్సిలర్లకు మరో ముగ్గురు కౌన్సిలర్లు వీరికి మద్దతు తెలపాల్సి ఉంటుంది. తొమ్మిది మంది కౌన్సిలర్ల బలం ఉన్న కాంగ్రెస్ ఎక్స్‌అఫీషియో సభ్యుడి ఓటుతో పాటు మరో తొమ్మిది మంది కౌన్సిలర్ మద్దతు కూడగట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఆశావహులు పదవుల కోసం సభ్యులను ప్రలోభపెడుతూ హామీలు ఇస్తున్నట్లు సమాచారం. ఛైర్మన్ ఆశావహుడు రూ.5లక్షలు, వైస్ ఛైర్మన్ రూ.2లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు తెలిసింది. ఎన్నికకు డబ్బు ప్రధానంగా పనిచేయనున్నట్లు సమాచారం. పదవులు దక్కించుకున్న వారు సుమారు ఎనిమిది నెలల పాటు పదవిలో కొనసాగే అవకాశం ఉండటంతో ఇంత భారీగా డబ్బులు ఖర్చు చేయడానికి కొందరు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. స్వల్ప వ్యవధితో పదవులు అనుభవించేందుకు డబ్బులు ఇచ్చే ఆశావహులు ఎన్నికల్లో విజయం సాధిస్తారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# దర్జాగా ఆక్రమణ.. కొరవడిన పర్యవేక్షణ

నర్సాపూర్: నర్సాపూర్ పట్టణ శివారులో ప్రభుత్వ భూములున్నాయి. వాటిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ, పురపాలిక అధికారులు పట్టించుకోవడంలేదు. పీర్లగుట్ట, శివాలయం, ఎన్జీవోల కాలనీలకు సమీపంలోని సర్కారు భూములు ఆక్రమణలకు గురయ్యాయి. ప్రభుత్వ, అసైన్డు భూములున్న సర్వే సంఖ్యలు 79, 731, 76, 114, 116, 126, 531, 80, 67ల్లో వందల ఎకరాల భూములున్నాయి. వీటిల్లో చాలా వరకు సాగు భూములు కూడా ప్లాట్లుగా మారిపోయాయి.

విలువ పెరగడంతో..: ఈ భూములను లబ్ధిదారులు చౌకగా అమ్మడంతో స్థిరాస్తి వ్యాపారులు వాటిని ప్లాట్లుగా మార్చేసి విక్రయిస్తున్నారు. సర్వేసంఖ్య 79లో మొత్తం 186.50 ఎకరాల భూమి ఉంది. ఇందులో సుమారు వంద ఎకరాలకు పైగా పేదలకు నాలుగు దశాబ్దాల కిందట అసైన్డు చేశారు. పట్టణం క్రమంగా విస్తరించడంతో వీటి విలువ అమాంతం పెరిగింది. నివాస యోగ్యానికి అనువుగా ఉందని వ్యాపారులు కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి అమ్మేశారు. ప్రస్తుతం ఇక్కడ గజం భూమి రూ.20వేలకు పలుకుతుండడం గమనార్హం.



హైదరాబాద్ జాతీయ రహదారిని ఆనుకుని దుకాణ సముదాయాలు వెలుస్తున్నాయి. 731 సర్వే సంఖ్యలో 232.32 ఎకరాలుండగా, 150 ఎకరాలు పేదలకు అసైన్డు చేశారు. వీటిల్లోనూ వాణిజ్య సముదాయాలు నిర్మించారు.సాగు భూములను ప్లాట్లుగా మారుస్తూ..: పట్టణం చుట్టూ ప్రధాన మార్గాల్లోని సర్వేసంఖ్య 79, 731, 76ల్లోని అసైన్డు భూముల ధరలకు రెక్కలొచ్చాయి. పట్టణం మీదుగా మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయ్యి వినియోగంలోకి రావడం, నర్సాపూర్ సమీపంలోంచి ప్రాంతీయ రింగ్ రోడ్డు నిర్మాణానికి హద్దులు ఏర్పాటు చేయడంతో ఇదే అదనుగా స్థిరాస్తి వ్యాపారులు ఇష్టానుసారం కొనుగోలు చేస్తూ, అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటీవల ఒకముఖ్య నేత రాయరావు చెరువు సమీపంలోని 76 సర్వే సంఖ్యలో రెండెకరాల అసైన్డు భూమిని కొనుగోలు చేసి ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారు.

మా దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు-ఫైజల్ మహ్మద్, ఆర్ఐ

ప్రభుత్వ, అసైన్డు భూముల ఆక్రమణ చట్టవిరుద్ధం. ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా ప్రభుత్వ భూమి కబ్జాలు, అసైన్డు భూముల అమ్మకాలు జరిగినట్లు మాదృష్టికి రాగానే విచారించి వెంటనే తాకీదులు ఇస్తున్నాం.

# భగీరథ బాధలు తీరేదెన్నడు?




పెద్దపల్లి : కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లి జనాభా 830. గ్రామంలో పైపులైన్ నిర్మించి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చారు. మొదట్లో కొద్దిగా నీరు వచ్చేది. ప్రస్తుతం గ్రామంలో ఎక్కడా నీరు రావడం లేదు. స్థానికులు పాత పథకాలు, ఇతర వనరులతో అవసరాలు తీర్చుకుంటున్నారు.ఓదెల మండలం ఉప్పరపల్లిలో తరచూ పైపులైన్లు లీకవుతున్నాయి. మరమ్మతు చేసినా పగిలిపోతోంది. దీంతో లీకేజీని అరికట్టకుండా వదిలేశారు. పైపుల లీకుతో నీరు కలుషితమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పాలకుర్తి మండలం జీడీనగర్‌లో రూ.20 లక్షలతో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత తాగునీటి పథకాన్ని నిర్మించారు. నీటి సరఫరా కనెక్షన్ కోసం స్థానికులు రెండేళ్లుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదు. తాగునీటి అవసరాలకు ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో నాసిరకమైన పనులకు తోడు గతేడాది భారీ వర్షాలకు పైపులైన్లు దెబ్బతిన్నాయి. పైపులైన్ల లీకేజీలపై అటు పంచాయతీ, ఇటు భగీరథ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా స్పందన కరవైంది. పంచాయతీలకు మంజూరు చేసే నిధుల్లో అధికంగా తాగునీటి సరఫరాకే వెచ్చిస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై సమగ్ర వివరాలు సేకరించాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించడంతో అధికారులు కార్యక్షేత్రంలోకి దిగారు. వేసవి ఎద్దడి నివారణకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ప్రతి ఇంటికీ 400 లీటర్లు

జిల్లాలోని 266 పంచాయతీల పరిధిలోని 436 ఆవాసాల్లో 352 రక్షిత తాగునీటి పథకాలు నిర్మించారు. జిల్లావ్యాప్తంగా 1,47,481 కనెక్షన్లు ఇచ్చారు. ఎల్లంపల్లి జలాశయం నుంచి ప్రతి ఇంటికీ 400 లీటర్ల చొప్పున 1.85 టీఎంసీల నీటిని సరఫరా చేస్తున్నారు. 436 ఆవాసాల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నా సంపూర్ణంగా సరఫరా చేస్తున్నట్లు పంచాయతీలు తీర్మానాలిచ్చాయి. ఉన్నతాధికారుల ఒత్తిడితో తీర్మానాలు ఇవ్వాల్సి వచ్చిందని సర్పంచులు చెబుతున్నారు.

అలంకారప్రాయంగా 31 పథకాలు

మిషన్ భగీరథ పథకంలో జిల్లాకు కేటాయించిన మిగులు నిధులతో నిర్మించిన 31 రక్షిత పథకాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మంథని నియోజకవర్గంలో రెండేళ్లుగా వృథాగా వదిలేశారు. గ్రామాల్లో మరమ్మతులు, నిర్వహణ కోసం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం)లో జిల్లాకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదించగా అప్పటి ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీంతో పంచాయతీలకు మరమ్మతు భారంగా మారింది.

ఇవీ సమస్యలు

మంథని మండలం భట్టుపల్లి సమీపంలోని చిన్న గుట్టపై ట్యాంకు నిర్మించి భట్టుపల్లి, ఖాన్‌సాయిపేట, ఆరెంద, వెంకటాపూర్, అడవిసోమన్‌పల్లి గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ప్రధాన ట్యాంక్‌కు నీరు సక్రమంగా రాకపోవడంతో అయిదు గ్రామాలకు ఇబ్బందిగా మారింది. పునరావాస గ్రామమైన రచ్చపల్లిలో కొత్త ట్యాంక్ నిర్మించడంతో దిగువ గ్రామమైన గద్దలపల్లికి నీరు రావడం లేదు.

ఓదెల ఎస్సీ కాలనీ, కనగర్తిలోని కేశవనగర్, మడక, గుంపుల, ఉప్పరపల్లి ఎస్సీ కాలనీల్లో తరచూ పైపులు లీకవుతున్నాయి. మరమ్మతులో జాప్యంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కాల్వశ్రీరాంపూర్ మండలంలోని సగం గ్రామాల్లో అరకొరగా నీరు సరఫరా అవుతోంది. స్థానికులు బోరుబావులున్న వారి ఇళ్లకు వెళ్లి తెచ్చుకుంటున్నారు.

కమాన్‌పూర్ మండలం గుండారం, రొంపికుంట గ్రామాల్లో కనెక్షన్లు ఇచ్చినా దాదాపు రెండేళ్లుగా చుక్క నీరు రాలేదు. పాత తాగునీటి పథకాలే దిక్కవుతున్నాయి.

పెద్దపల్లి మండలం అప్పన్నపేట, రాగినేడు, రేగడిమద్దికుంట గ్రామాలకు నీరు అందడం లేదు. ప్రధాన పైపులైన్‌తో పాటు అంతర్గత పైపులైన్ లీకేజీలతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది.

సరఫరాలో లోపాలు సరి చేస్తున్నాం-శ్రీనివాస్, మిషన్ భగీరథ(గ్రిడ్ విభాగం) ఈఈ జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరఫరాలో లోపాలను సరిచేస్తున్నాం. ప్రతి ఊరికి నీరు సరఫరా అవుతోంది. లీకేజీలతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పంచాయతీలకే మరమ్మతు చేసుకోవాలి. బిల్లుల చెల్లింపు కోసం ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. సరఫరా సమస్యలను గుర్తిస్తాం.

# పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన




హుజూరాబాద్ : గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగియనుంది. దీంతో ప్రభుత్వ ఆదేశాలతో ఆయా పంచాయతీల్లో ప్రత్యేకాధికారులను నియమించేందుకు అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని గత డిసెంబరులోనే ఆదేశించినప్పటికీ కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు సంసిద్ధత వ్యక్తం చేయలేదు. దీంతో ప్రత్యేకాధికారుల పాలన అనివార్యమైంది. శుక్రవారం నుంచి పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు పాలన కొనసాగించే అవకాశముంది.

313 మందితో జాబితా సిద్ధం

2019లో పంచాయతీ ఎన్నికలకు జనవరి 1వ తేదీన షెడ్యూలు, నోటిఫికేషన్ వెలువడింది. జనవరి 21, 25, 30 తేదీల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి 1వ తేదీన సర్పంచులు, వార్డు సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగిసేలోపు ఎన్నికలను నిర్వహించాలి కానీ.. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఎన్నికలను నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యేకాధికారుల ద్వారా పంచాయతీ పాలన కొనసాగించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 313 పంచాయతీల్లో ప్రత్యేకాధికారులను నియమించేందుకు వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారుల జాబితాను ఇప్పటికే సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశారు. అన్ని పంచాయతీలకు గెజిటెడ్ అధికారులను నియమించాలని ప్రభుత్వం ఆదేశించినా.. ఆయా మండలాల్లో గెజిటెడ్ అధికారులు లేకపోవడంతో నాన్ గెజిటెడ్ అధికారులను నియమించేలా ఏర్పాట్లు చేశారు.

ఎన్నికల నిర్వహణతో సంబంధం లేని అధికారులే..

లోక్‌సభ ఎన్నికల గడువు సమీపిస్తుండడంతో ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం లేని ప్రభుత్వ శాఖల అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమిస్తున్నారు. వీరిలో ఎంపీడీవో, ఎంపీవో, తహసీల్దార్, ఉప తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్లు, పంచాయతీరాజ్ సహాయ ఇంజినీర్లు, గ్రామీణ నీటి సరఫరా శాఖ సహాయ ఇంజినీర్లు, ఐసీడీఎస్ అధికారులు, మండల విద్యాధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, పశు వైద్యాధికారులు, వైద్యారోగ్యశాఖ, ఉద్యానశాఖ అధికారులు, గెజిటెడ్ హెడ్మాస్టర్లతో పాటు డివిజన్, జిల్లా కార్యాలయాల్లో తత్సమాన హోదా కలిగిన అధికారులున్నారు. జనాభా ప్రాతిపదికన జిల్లాలో 50 శాతం పంచాయతీల్లో గెజిటెడ్ అధికారులను, 1,000లోపు జనాభా కలిగిన పంచాయతీల్లో ఇతర అధికారులను నియమించేలా జాబితాను సిద్ధం చేశారు.

ప్రభుత్వ ఆదేశాలకు అనుణంగానే..- పవన్‌కుమార్, జడ్పీ సీఈవో, కరీంనగర్ప్రత్యేకాధికారుల నియామకం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే జరుగుతుంది. కలెక్టర్ సూచన మేరకు ఇప్పటికే 313 పంచాయతీల జాబితా సిద్ధం చేశాం. ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీకాలం ముగిస్తుండగా 2వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

# మిరప తాలుతో రైతుల కష్టాలు!

భువనగిరి : మిరప రైతులకు తాలు కన్నీళ్లు తెప్పిస్తోంది. గతంలో క్వింటా దిగుబడి సాధిస్తే 10 కిలోలు మాత్రమే తాలు ఉండేది. కానీ ఇప్పుడు క్వింటా దిగుబడిలో 50 కిలోలు తాలే ఉంటోంది. దీంతో ధర రాక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో మిరప సాగు కష్టాల సుడిలో చిక్కుకుంది. ఆకుముడత, నల్లతామర పురుగు, ఎర్ర నల్లి, ఎండు తెగుళ్లు ఇతరత్రా కారణాలతో పెట్టుబడులు అధికమయ్యాయి. తీరా పంట చేతికి వస్తుందనుకుంటున్న సమయంలో మిగ్‌జాం తుఫాన్ నష్టాన్ని మిగిల్చింది. పంటంతా కిందపడడంతో పాటు దిగుబడిపై ప్రభావం పడింది. ఇదే సమయంలో ఎర్ర మిరపలో తాలు(తెల్ల) కాయల శాతం పెరగడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. సగానికి సగం తాలు ఉండడంతో కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి వస్తే 5 నుంచి 7 క్వింటాళ్ల వరకు తాలే ఉండడంతో అన్నదాతలు బోరుమంటున్నారు. ఇటీవల వరకు తెల్ల మిరప క్వింటా ధర రూ.14 వేలు పలుకగా ప్రస్తుతం కనిష్ఠ ధర రూ.6వేలు, గరిష్ఠ ధర రూ.10,500 వరకు పడిపోయిన నేపథ్యంలో మిరప రైతులు ఆందోళన పడుతున్నారు.



కూలీల ఖర్చు కూడా రావడంలేదు.. - బాలకృష్ణ, బాల్నేపల్లి, అడవిదేవులపల్లి మండలం

నాలుగు ఎకరాల్లో మిరప సాగు చేశాను. 35 శాతం తెల్ల కాయలు ఉండడంతో కూలీల ఖర్చు పెరిగింది. తాలుకాయలు అమ్మేందుకు ప్రయత్నించగా క్వింటాలుకు రూ.6వేలు మాత్రమే అడగడంతో ఏం చేయాలో అర్థంకాక శీతల గిడ్డంగిలో భద్రపరిచాను. కనీసం కూలీల ఖర్చు కూడా రావడంలేదు.

# ఎత్తిపోతలపై ఆశల చిగురింత..!

మేళ్లచెరువు : హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని దాదాపు 1.20 లక్షల ఎకరాలకు పూర్తి స్థాయిలో సాగునీరందించేందుకు ఎత్తిపోతల పథకాలు సిద్ధం అవుతున్నాయి. వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి లక్ష్యం ప్రకారం ఐదు కొత్త పథకాలూ పూర్తి చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో పడావున ఉన్న పథకాలను పునరుద్ధరించి, పాక్షికంగా నడుస్తున్న వాటి మరమ్మతులు పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోంది. దీంతో ఎత్తిపోతల పథకాలపై రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

రెండింటి పునరుద్ధరణ

చింతలపాలెం మండలంలో కృష్ణానదిపై గతంలో నిర్మించిన నక్కగూడెం, కోదాడ మండలం శాంతినగర్ వద్ద పాలేరు వాగుపై నిర్మించిన ఉత్తమ్ పద్మావతి ఎత్తిపోతల పథకాలు రెండూ పడావుపడ్డాయి. రూ.41 కోట్లతో నక్కగూడెం, మరో రూ.7.4 కోట్లతో ఉత్తమ్ పద్మావతి ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించనున్నారు. ఇవిగాక హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో పడావున పడిన మరో 19 పథకాల భౌతిక స్థితిపైనా మంత్రి ఉత్తమ్ ఆదేశాల మేరకు సమగ్ర పరిశీలన చేస్తున్నట్టు నీటి పారుదల శాఖ సీఈ రమేష్‌బాబు తెలిపారు.

మరమ్మతులకు నిధుల మంజూరు

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, కృష్ణానదిపై రెండు నియోజకవర్గాల పరిధిలో 54 ఐడీసీ (నీటి పారుదల సంస్థ) కింద, మరో 17 ఎన్నెస్పీ పరిధిలోనివి, ఐడీసీ కింద ఉన్న వాటిలో 16 పూర్తి స్థాయిలో, 17 పాక్షికంగా నడుస్తుండగా వీటికింద సుమారు 66 వేల ఎకరాలు, ఎన్నెస్పీ ఎత్తిపోతల పథకాల కింద 38 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.



ఇవేవీ పూర్తి స్థాయిలో నీరందించడం లేదు. లక్ష్యం ప్రకారం వీటన్నింటికీ మరమ్మతులు చేయనున్నారు. మఠంపల్లి, చింతలపాలెం మండలాల్లో ఎనిమిది పథకాలకు తాజాగా రూ.2.45 కోట్లు నిధులు మంజూరయ్యాయి. నేడో రేపో టెండర్లు పిలవనున్నారు.

నిర్వహణపై దృష్టి

ఎత్తిపోతల పథకాల నిర్వహణే అసలు సమస్య. రూ.కోట్లతో నిర్మించిన ఈ పథకాలపై ఇప్పటివరకు శాఖల పర్యవేక్షణ ఉన్నా ఆపరేటర్లు, మరమ్మతులకు నిధుల విడుదలలో తీవ్ర జాప్యం వెంటాడుతోంది. గత్యంతరం లేని స్థితిలో సొసైటీల పేరుతో కొన్నింటిని రైతులే నిధులు సమీకరించుకొని నడుపుకొంటున్నారు. చాలాచోట్ల సమన్వయం లేక పడావున పడ్డాయి. ఈ పరిస్థితులను అధిగమించాలంటే పథకాల నూతన నిర్మాణం, పునరుద్ధరణ, మరమ్మతులతో పాటు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్ల నియామకం అనివార్యం. ఈ అంశంపైనా ఈసారి ప్రభుత్వం దృష్టిసారించే అవకాశం ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు.

సర్వే షురూ

1: మంత్రి ఉత్తమ్ ఆదేశాల మేరకు కొత్త ఎత్తిపోతల పథకాలకు సర్వే పనులు ప్రారంభించారు. చింతలపాలెం మండలం బుగ్గమాధారం వద్ద కృష్ణానదిపై దొండపాడు-2 పేరుతో కొత్త ఎత్తిపోతల సర్వే పనులు చేపట్టారు. దీని లక్ష్యం 8,500 ఎకరాలు. దీని నుంచి కృష్ణా జలాలను ఒక పైపులైన్‌లో ఎన్నెస్పీ ముక్త్యేశ్వరపురం మేజరు 7వ కిలోమీటరు వద్ద, ఈ మేజరులోనే 13.5 కిలోమీటరు వద్ద రెండో పైపులైన్ ద్వారా విడుదల చేస్తారు. మేళ్లచెరువు, చింతలపాలెం, కోదాడ మండలాల్లోని కందిబండ, రామాపురం, దొండపాడు, యతిరాజాపురంతండా, కూచిపూడితండాల పరిధిలో భూములకు ఈ నీరు అందుతుంది.

2: తమ్మారం ఎత్తిపోతల రెండోది. ఇది చింత్రియాల మేజరు కాల్వ 18వ కిలోమీటరు వద్ద నీటిని ఎత్తిపోస్తుంది. 2,400 ఎకరాలకు నీరు అందిస్తుంది.

3: మఠంపల్లి మండలం బొజ్జా తండా ఎత్తిపోతల మూడోది. దీని సర్వే మొదలైంది.

4: పాలకవీడు మండలం బెట్టతండా వద్ద రూ.36.4 కోట్లతో నాలుగో ఎత్తిపోతలను ప్రతిపాదించారు. ఇది మూసీ నది నీటిని ఆర్-12 జాన్‌పహాడ్ మైనరు కాల్వలో విడుదల చేస్తుంది. ఈ నీరు చివరి పాంతంలోని 2,040 ఎకరాలకు వెళ్తుంది.

5: కోదాడ మండలం రెడ్లకుంట ఎత్తిపోతల ఐదోది. 4,460 ఎకరాలకు సాగు నీరందించాలన్నది దీని లక్ష్యం.

# ఉపాయంతో.. రెయిన్‌గన్ మోగింది..!

నేరేడుచర్ల: సాగర్ ఆయకట్టులో ఈసారి రైతులు పంటలను రక్షించుకునేందుకు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా లేకపోవడం, సాగర్ జలాశయంలో నీరు అడుగంటడంతో ఆయకట్టు రైతులు ఈసారి పూర్తిస్థాయిలో వరి సాగు చేయలేని విపత్కర పరిస్థితి ఏర్పడింది. యాసంగిలో బోర్లు, బావులు ఉన్న రైతులు కొంత మేర మాత్రమే వరిసాగు చేసి మరికొంత ఆరుతడి పంటలు సాగు చేశారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న



గ్రామానికి చెందిన సుంకర శ్రీరామ్మూర్తి అనే ఔత్సాహిక రైతు ఎప్పుడూ ఇతర రైతులకు భిన్నంగా ఆలోచిస్తూ ఆధునిక పద్ధతులను అనుసరించడంలో ముందుంటారు. ఈ యాసంగి సీజన్‌లో బోర్ల కింద కొంత వరి సాగు చేపట్టిన ఆయన రెండెకరాల విస్తీర్ణంలో మినుము పంట సాగు చేశారు. నీరు సరిపడా లేనందున తక్కువ నీటితో ఆ పంటను రక్షించడం ఎలా అని ఆలోచించి రూ.7 వేలదాకా వెచ్చించి రెయిన్ గన్ అనే పరికరాన్ని కొనుగోలు చేసి తెచ్చారు. బోరు నుంచి రెయిన్ గన్‌కి పైపులు అమర్చి తక్కువ నీటితో పంటను రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. స్టాండ్‌కి అమర్చిన రెయిన్‌గన్ చుట్టూ తిరుగుతూ 60 అడుగుల మేర నీరు వెదజల్లుతుంది. మినుము ఆరుతడి పంట కాబట్టి నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రస్తుత తరుణంలో ఇలా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటను కాపాడగలమని శ్రీరామ్మూర్తి తెలిపారు.

# ముగిసిన ప్రత్యేక సర్వే

సిరిసిల్ల : ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చేయూతను అందించేందుకు జిల్లాలో సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా నిర్వహించిన ప్రత్యేక సర్వే ముగిసింది. 2023 డిసెంబరు 19న ప్రారంభమైన ప్రత్యేక సర్వేలో, సర్వే ముగిసే నాటికి జిల్లాలో 21 రకాల వైకల్యం ఉన్న వారిని మొత్తం 1118 మంది విద్యార్థులను గుర్తించారు. చిన్నతనం నుంచే అంగవైకల్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. ఎముకల బలహీనత, పక్షవాతం, బుద్ధిమాంద్యం, రక్తహీనత, మాటలురానివారు, చదవడం రాయడంలో ఇబ్బందిపడు తున్నవారు, దీర్ఘకాలిక కండరాల వ్యాధులతో బాధపడు తున్న వారిని గుర్తించి వారిని సాధారణ విద్యార్థుల మాదిరిగా నే సమాన అవకాశాలు కల్పించడంతో పాటు వైద్య సేవలు అందిస్తోంది. దీనిలో భాగంగానే 2023-24 విద్యా సంవత్సరానికి ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్‌పీ)లు జిల్లాలోని ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించారు. గుర్తించిన విద్యార్థుల వివరాలను యూడైస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నారు.

18 సంవత్సరాల లోపువారిని గుర్తింపు



జిల్లాలోని 13 మండలాల్లో ఐఈఆర్‌పీలు ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు కోసం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఇంటింటి సర్వేతో పాటు ఆయా గ్రామాల అంగన్‌వాడీలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సహాయం తీసుకున్నారు. ఈ సర్వేలో 18ఏళ్లలోపు పిల్లలను గుర్తించారు. సర్వే పూర్తయిన తర్వాత వీరిలో పాఠశాలల్లో చదివే వారు, భవిత సెంటర్లు, ఇంటి వద్దనే చదువుకునే వారిని గుర్తించారు. ఇంటి వద్ద చదువుకునేవారికి వారానికి ఒక రోజు ఐఈఆర్‌పీలు వెళ్లి వారికి చదువు చెప్పనున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం నుంచి అందించే సదుపాయాలతో పాటు వీరిలో కొందరిని పాఠశాలలకు తీసుకువచ్చేందుకు సహాయకులను నియమించి వారికి డబ్బులు చెల్లించనున్నారు. ట్రై సైకిళ్లు, టీచింగ్ కిట్స్, వినికిడి యంత్రాలు తదితర పరికరాలు అందించడంతో పాటు ఫిజియోథెరపీ డాక్టర్‌తో నెలకు నాలుగు పర్యాయాలు వీరికి చికిత్స అందించనున్నారు.

పిల్లలపై శ్రద్ధ- రమేష్‌కుమార్, జిల్లా విద్యాధికారి

జిల్లాలో ప్రత్యేక సర్వేలో ఐఈఆర్‌పీలు 1118 పిల్లలను గుర్తించాం. ఎక్కువ మానసిక వికలాంగత్వం ఉన్న వారికి కౌన్సిలింగ్ ఇప్పించాం. ఐఈఆర్‌పీలు వారి తల్లిదండ్రులతో మాట్లాడి తగిన సూచనలు, సలహాలు ఇస్తాం. మిగతా వారిని వారికి దగ్గరలో ఉన్న పాఠశాలల్లో చేర్పించి ఉపాధ్యాయులతో వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి మిగతా పిల్లలతో సమానంగా విద్యను అందిస్తాం. ఇంకా ఎవరైనా పిల్లలు మిగిలి ఉంటే సమీపంలోని భవిత కేంద్రాల్లో సంప్రదించాలి.

# జాడ లేని.. నుడా..!

నల్గొండ : నీలగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) పేరు గొప్ప..ఊరు దిబ్బ అనే మాదిరిగా మారిపోయింది. ఆవిర్భవించి రెండేళ్లు పూర్తి అయినా అతీగతి లేకుండా పోయింది. పాలకవర్గం ఏర్పాటు, నిధుల మంజూరు వంటి అంశాలు మరుగున పడిపోతున్నాయి. నుడా కార్యకలాపాలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. కొత్త పోస్టులు మంజూరు చేయకపోవడంతో నుడా మసకబారిపోతోంది.

పాలకవర్గం ఏదీ..!ఇప్పటి వరకు పాలకవర్గం కొలువు దీరలేదు. గత భారాస ప్రభుత్వం అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. జిల్లా పరిపాలన అధికారిని ఛైర్మన్‌గా, పుర కమిషనర్‌ను వైస్‌ఛైర్మన్‌గా, నుడా పరిధిలోని ఎమ్మెల్యేలు, పుర సంచాలకులను సభ్యులుగా నియమించిన విషయం తెలిసిందే. అయినా ఇప్పటి వరకు కమిటీ సమీక్షలు, సమావేశాలకు నోచుకోవడంలేదు. నుడా ఛైర్మన్ పదవిపై కాంగ్రెస్ నేతలు ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.




రెండేళ్ల కింద అప్పటి ప్రభుత్వం నుడా ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా రైతుల నుంచి భూములను సేకరించి స్థిరాస్తి వ్యాపారం చేసి నిధులు సమకూర్చుకోవాలని నిర్ణయించింది. అందుకు జిల్లా యంత్రాంగం నల్గొండ నుంచి నాగార్జునసాగర్ వెళ్లే జాతీయరహదారి సమీపంలోని కొత్తపల్లి పరిధిలోని భూములు, అదే విధంగా కట్టంగూరు మండల కేంద్రానికి సమీపంలోని దండెంపల్లి వద్ద భూములు సేకరించి వెంచర్లు వేసేందుకు నిర్ణయించారు. రెండు మూడు పర్యాయాలు రైతులకు అవగాహన కల్పించారు. అప్పటి కలెక్టర్ బదిలీ కావడంతో నుడాను పట్టించుకునే వారే లేకపోయారు. కలెక్టర్లు, కమిషనర్లు బదిలీలు అవుతున్నారు తప్ప ఇప్పటి వరకు ల్యాండ్ పూల్లింగ్ అంశం పట్టించుకోవడం లేదు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి నూడా పరిధిలోని గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరుతో పాటు అధికారులను భర్తీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అంతా ఆర్భాటమే..నల్గొండ పురపాలికతో పాటు తిప్పర్తి, కనగల్, నల్గొండ గ్రామీణం, నార్కట్‌పల్లి, కట్టంగూరు, నకిరేకల్ మండలాల పరిధిలోని 42 గ్రామాలను కలిపి 2022 జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం నుడాను ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నుడా కార్యకలాపాలు నిర్వహణ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ప్రత్యేకంగా కొత్త పోస్టులు మంజూరు చేసి అధికారులను నియమించకపోవడం ఒక కారణమైతే, గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడంతో సమస్యల తీవ్రత పెరిగిపోతోంది.

# చిత్తశుద్ధి చూపేదెప్పుడు?



సిరిసిల్ల : మురుగు శుద్ధిపై చిత్తశుద్ధి లోపిస్తోంది. వ్యర్థ జలాల నిర్వహణకు సరైన వ్యవస్థ లేక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఫలితంగా అటు పర్యావరణానికి.. ఇటు పట్టణ ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది. జిల్లాలోని రెండు పట్టణాల్లోనూ మురుగు నీటి నిర్వహణ లేదు. సిరిసిల్ల పురపాలికకు ఏడాది క్రితం ఎస్టీపీ (మురుగు శుద్ధి కేంద్రం) మంజూరైంది. పనులు మాత్రం అసంపూర్తి దశలోనే ఉన్నాయి. వేములవాడ పురపాలికలో ప్రతిపాదనలకే పరిమితమైంది. పట్టణాల్లోని గృహ సముదాయాల నుంచి వెలువడే వ్యర్థ జలాలు నాలాలు, డ్రైయిన్ల ద్వారా నేరుగా వాగుల్లో కలుస్తున్నాయి. ఇలా కాకుండా మురుగంతా ఎస్టీపీలకు తరలించి అక్కడ శుద్ధి చేసి పునర్వినియోగిస్తే కాలుష్యం తగ్గడంతోపాటు పట్టణాల్లో వరద సమస్యకూ ఓ పరిష్కారం లభిస్తుంది. ఇలా చేస్తే పట్టణాలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వాటర్ ప్లస్ జాబితాలోకి చేరుతాయి. కేంద్రం నుంచి ప్రోత్సాహకాలు లభిస్తాయి.

పట్టణాల మురుగంతా వాగుల్లోకి

జిల్లాలోని సిరిసిల్ల పురపాలికలో 33,008 గృహాలు, 92 వేల జనాభా ఉంది. పట్టణం మొత్తానికి పద్మానగర్, వెంకంపేట నుంచి శాంతినగర్ మీదుగా మానేరు, మరోవైపు కొత్తచెరువు శ్రీనగర్‌కాలనీ నుంచి మానేరులోకి మురుగునీరు వెళ్తోంది. పద్మానగర్ ఎగువ నుంచి వచ్చే మురుగంతా వ్యర్థాలతో నేరుగా కొత్తచెరువులోకి వెళ్లకుండా అక్కడ ఈటీపీ (ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను ఏర్పాటు చేశారు. వర్షాకాలం వరదనీరు సాఫీగా వెళ్లడంలేదని పక్కన పెట్టారు. దీంతో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు నేరుగా కొత్తచెరువులోకి వెళ్తున్నాయి. దీంతోనే ప్రధాన కాల్వల్లో నీరు సాఫీగా వెళ్లలేని పరిస్థితి. ద్రవ వ్యర్థాలతోపాటు డైయింగ్ యూనిట్ల నుంచి వెలువడుతున్న రంగులు, రసాయనాలు.. రాజరాజేశ్వర జలాశయం వెనక జలాల్లో కలుస్తున్నాయి.

: రోజుకు సగటున 20 ఎంఎల్‌డీ (మిలియన్ లిక్విడ్ డిశ్చార్జి)లకు పైగా మురుగు వెలువడుతోంది. రెండేళ్ల క్రితం వరకు మురుగునీరు ఇలా జలాశయంలో కలవడంలో పెద్ద సమస్యలేవీ ఉత్పన్నం కాలేదు. కాగా వేసవిలో జలాశయంలో నీటి నిల్వ 15 టీఎంసీల దిగువకు చేరినపుడు నీటిలో రంగు, గాఢతల స్థాయి పెరుగుతోంది. దీంతో అగ్రహారంలోని భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో నిర్వహణ సమస్యలు తలెత్తుతున్నాయి. దీని ప్రభావం గ్రామాలకు శుద్ధజలం సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. పట్టణం నుంచి వెలువడుతున్న మురుగునీటిని శుద్ధిచేసి జలాశయంలోకి పంపడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

సిరిసిల్ల పురపాలికలో రూ.61 కోట్లతో స్టేజ్-1, స్టేజ్-2లో ఎస్టీపీ నిర్మాణం చేపట్టనున్నారు. దీనిలో స్టేజ్-1లో రూ.39 కోట్లతో పనులు జరుగుతున్నాయి. 90 శాతం పనులు పూర్తయ్యాయి. విద్యుత్తు పరికరాలు, మోటార్ల బిగింపు ప్రక్రియ మిగిలి ఉంది. గుత్తేదారుకు రూ.25 కోట్ల వరకు బకాయిలు ఉండటంతో పనులు నెమ్మదించాయి. మార్చితో గుత్తేదారు పనుల గడువు ముగియనుంది. ఈ లోపు పనులు పూర్తి చేయాలి. ఎస్టీపీ పని చేయడం ప్రారంభమైతే పట్టణంలో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

ర్వహణ గుత్తేదారు సంస్థదే..ఎస్టీపీ నిర్మాణంలో ఇప్పటి వరకు చేసిన పనులకు గాను పెండింగ్‌లోని డబ్బులు ప్రభుత్వం నుంచి విడుదలైతే రెండు నెలల్లో నిర్వహణకు సిద్ధమవుతుంది. నిర్మాణంతోపాటు అయిదేళ్ల నిర్వహణ బాధ్యత గుత్తేదారు సంస్థపైనే ఉంది. దాని తర్వాత పురపాలికకు అప్పగిస్తారు. అప్పుడు కూడా కేంద్రం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధుల్లో యాభై శాతం ఈ ప్లాంటు నిర్వహణకు వినియోగించుకునే అవకాశం ఉంది. దీంతో పురపాలికపై నిర్వహణ భారం తగ్గుతుంది.ప్రారంభించేలా చర్యలు- ఆయాజ్, కమిషనర్, సిరిసిల్ల పురపాలికఎస్టీపీ పనుల పూర్తికి రెండు నెలల సమయం ఉంది. పట్టణంలోని మురుగునీటి కాల్వలను శుద్ధికేంద్రానికి అనుసంధానం చేసేలా ప్రణాళికలు చేస్తున్నాం. భవిష్యత్తు అవసరాలతోపాటు డైయింగ్ యూనిట్ల నుంచి వెలువడే రసాయనాలు పెరిగితే స్టేజ్-2 నిర్మాణానికి ముందస్తు ప్రణాళికలు చేశాం. పెండింగ్ బిల్లుల చెల్లింపులు త్వరలోనే ఎస్టీపీ వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

# ఇక పల్లెల్లో ప్రత్యేక పాలన



పెద్దపల్లి : పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియనుంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోవడంతో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పల్లెల్లో పాలన అందించనున్నారు. ఈ మేరకు జిల్లాలో ప్రత్యేకాధికారుల నియామకంపై కసరత్తు తుది దశకు చేరింది. పంచాయతీల జనాభా ప్రాతిపదికన జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల్లో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ హోదా కలిగిన అధికారుల జాబితా సిద్ధమైంది. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే ప్రత్యేక అధికారుల పాలన మొదలవనుంది. సర్పంచుల నుంచి చెక్‌బుక్కులు, ఇతర దస్త్రాలను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఈ దిశగా అధికారులు సిద్ధమవుతున్నారు.

జనాభా ప్రాతిపదికన కేటాయింపు

గత ప్రభుత్వం పల్లె పాలనకు పెద్దపీట వేస్తూ కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం పదేళ్ల వరకు ప్రస్తుత రిజర్వేషన్లు యథావిధిగా కొనసాగనున్నాయి. సర్పంచుల పదవీ కాలం పూర్తయ్యేలోగా ఎన్నికల నిర్వహణ సాధ్యం కాకపోవడంతో కొత్త చట్టం ప్రకారం ప్రత్యేకాధికారి పాలన కొనసాగనుంది. మండలకేంద్రాలకు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేకాధికారులుగా వ్యవహరించనున్నారు. మేజర్ పంచాయతీలకు తహసీల్దార్లు, అధిక జనాభా కలిగిన ఇతర గ్రామాలకు ఎంపీడీవోలు, ఆ తర్వాత జనాభాను బట్టి ఉప తహసీల్దార్లు, ఎంపీవోలను ప్రత్యేకాధికారులుగా నియమిస్తారు.

బకాయి బిల్లులపై ఆందోళన

గత అయిదేళ్లలో పల్లెల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. పలువురు సర్పంచులు పోటీ పడి పనులు చేపట్టారు. వీటితో పాటు పంచాయతీ భవనాల నిర్మాణం, 'మన ఊరు-మన బడి' అభివృద్ధి పనులు చేశారు. వెంటది వెంట బిల్లులు రాకున్నా ఎప్పటికైనా రాకపోతాయా అని పనులు చేస్తూ పోయారు. పదవీ కాలం ముగుస్తుండటంతో బకాయి బిల్లులపై సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేకాధికారులకు చెక్ పవర్ ఇస్తే తమ బిల్లుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపై ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శికి సంయుక్తంగా చెక్ పవర్ ఇచ్చే అవకాశం ఉంది.

సమస్యలు పరిష్కారమయ్యేనా!

పల్లెల్లో పారిశుద్ధ్య పనులు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటివి నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలు. సర్పంచులు, కార్యదర్శుల సహకారంతో వీటిని ఎప్పటికప్పుడు పరిష్కరించారు. ప్రత్యేకాధికారుల పాలనలో అధికారితో పాటు కార్యదర్శి ఆమోదంతో అవసరమైన పనులు చేయాల్సి ఉంటుంది. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులకు ఒకటికి రెండు సార్లు చెబితేనే సమస్యలు పరిష్కారమయ్యేవని, ఇతర ప్రాంతాల్లో ఉండే అధికారుల పాలనలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా 2020లో మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలకు కూడా ప్రత్యేకాధికారులను నియమించనున్నారు.

ప్రభుత్వం ఆదేశించిన వెంటనే నియామకాలు-చంద్రమౌళి, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లాలోని 267 పంచాయతీలకు ప్రత్యేకాధికారుల జాబితాను సిద్ధం చేశాం. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన వెంటనే నియామక ఉత్తర్వులు జారీ చేస్తాం. జనాభా ప్రాతిపదికన జిల్లా నుంచి మండల స్థాయి అధికారులను పంచాయతీలకు కేటాయిస్తున్నాం.

# ప్రథమ పౌరుడికి సెలవు.. ప్రత్యేక పాలనకు నెలవు

సూర్యాపేట : సర్పంచుల పదవీకాలం ముగియనుండటంతో ప్రత్యేక అధికారుల పాలనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అధికారుల నియామకం చేపట్టి, వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నుంచి ప్రత్యేక పాలన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. ఇప్పటికే సర్పంచుల నుంచి దస్త్రాలు, డిజిటల్ కీలు స్వాధీనం చేసుకున్నారు.ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టేలా ప్రత్యేక అధికారులకు పూర్తి అవగాహన కల్పించారు. వారు ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును పూర్తిగా పర్యవేక్షించేలా సన్నద్ధం కానున్నారు. ఇప్పటికే బాధ్యత వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుని పాలన సాగించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యేక అధికారుల పాలన ఎప్పటి వరకు ఉంటుందో తెలియకపోవడంతో వారి పాలన ఎలా ఉంటుందోనన్న సందిగ్ధం నెలకొంది.

నిధులు రాలేదని ఆందోళన! ఉమ్మడి జిల్లాల్లోని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి కొంతమంది సర్పంచులు సొంతంగా ఖర్చు చేశారు. కాగా వాటికి సంబంధించి బిల్లులు నేటికీ విడుదల కాలేదని కొందరు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఆందోళనలు, రాస్తారోకోలు చేసిన ఘటనలు చోటు చేసుకున్నాయి. బిల్లులు విడుదల చేసేందుకు దస్త్రాలు ఇచ్చేది లేదని అక్కడక్కడ కొందరు సర్పంచులు చెబుతున్నారు.ప్రత్యేక అధికారులు వీరేఉమ్మడి జిల్లాలోని 1,740 గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పాలన ముగుస్తుండటంతో ప్రత్యేక అధికారులకు పాలన బాధ్యతలు అప్పగించారు. ఏఏ పంచాయతీకి ఏఏ శాఖల అధికారులు బాధ్యత వహిస్తారో అధికారులు నిర్ణయించారు. మేజర్, అధిక జనాభా కలిగిన పంచాయతీల వారీగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రధానోపాధ్యాయులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ రాజ్ సహాయ ఇంజినీర్లు, మండల విద్యాధికారులు, పశు వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్లు, ఉద్యాన అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మండల పరిషత్ సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, స్కూల్ అసిస్టెంట్లు, ఉప తహసీల్దార్లకు ప్రత్యేక అధికారుల బాధ్యత అప్పగించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.

# మదింపుకో గుర్తింపు..!

నల్గొండ : పొదుపు సంఘాలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చి మరింత జవాబుదారీగా ఆర్థిక వ్యవహారాలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి పొదుపు సంఘానికి ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించనున్నారు. ఏ స్థాయి అధికారి అయినా అంతర్జాలం ద్వారా పొదుపు సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధిని పరిశీలించే అవకాశం కల్పించనుంది. ఇందుకోసం లోకోస్ (లోక్ ఆపరేటింట్ సిస్టం) పేరిట యాప్‌ను రూపొందించారు. వీలైనంత త్వరగా వివరాలు నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ప్రయోజనాలు ఇలా..పొదుపు సంఘాల సభ్యులు నిరక్షరాస్యులు కావడంతో కొన్ని గ్రామైక్య సంఘాల బాధ్యులు వారి పేరిట రుణాలు తీసుకొని అవసరాలు తీర్చుకుంటున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఈ యాప్ వినియోగంతో దీన్ని నిలువరించే అవకాశం ఉంటుంది. సంఘాల సభ్యులు, ఉన్నతాధికారులు వివరాలను ఎప్పటికప్పుడు యాప్ ద్వారా చూసుకునే అవకాశం ఉంటుంది. యాప్‌లో వివరాలను నమోదు చేసిన తర్వాత ప్రతి పొదుపు సంఘానికో గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. జిల్లా, మండలం, గ్రామానికి ఒక్కో సంఖ్య కేటాయిస్తారు.



సులభంగా తెలుసుకోవచ్చు

గతంలో సభ్యులు బ్యాంకులకు వెళ్లి తమ పొదుపు, అప్పుల వ్యవహారాలను తెలుసుకునేవారు. ఇకపై అంతర్జాలం ద్వారా సులువుగా తమ ఆర్థిక పరిస్థితిని మదింపు చేసుకొని ప్రణాళికను రూపొందించుకునే వీలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక అధికారులుగా డీపీఎంలు

సభ్యుల వివరాలు యాప్‌లో నిక్షిప్తం చేయడంలో ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందు కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఐదు విభాగాల డీపీఎంలకు మండలాలు కేటాయించి సంఘాల సభ్యుల వివరాలు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించి గడువును నిర్దేశించారు.

యాప్‌లో నమోదు లోకోస్ యాప్‌లో సభ్యుల వివరాలు, పేర్లు, ఆధార్ సంఖ్యలు, సభ్యుల బ్యాంకు ఖాతాల సంఖ్యలు, సభ్యత్వం తీసుకున్న తేదీ, తీసుకున్న అప్పులు, పొదుపు, రుణాలు చెల్లించిన తీరు (రుణ చరిత్ర) వివరాలను ఈ యాప్‌లో పొందుపరుస్తారు. ఇక నుంచి జరిగే ఆర్థిక లావాదేవీలను కూడా ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేస్తారు.

# ఓ జట్టుగా.. గుట్టుగా..!

సూర్యాపేట : తన తండ్రి జూదానికి బానిసై ప్రతిరోజూ కోదాడకు వెళ్తున్నాడని, ఒకే రోజు రూ.రెండు లక్షలు పోగొట్టాడని, ఫలితంగా కుటుంబం అప్పులపాలవుతోందని పట్టణానికి చెందిన ఓ యువకుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే చాలా కుటుంబాలు రోడ్డున పడే అవకాశముందని, అధికారులు స్పందించి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నాడు. ఓ ప్రభుత్వ ఉద్యోగి ఈ ఆటలో రూ.20 లక్షలు సంపాదించగా..ఆ తర్వాత రూ.22 లక్షలు పోగొట్టుకుని అప్పుల పాలైనట్లు తెలుస్తోంది. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఓ వ్యాపారి వారం రోజుల క్రితం ఒకే రోజు రూ.4 లక్షలు ఆటలో పోగొట్టుకున్నారు. కార్లు, బైక్‌లు, బంగారు ఆభరణాలు తనఖా పెట్టి.. డబ్బులు తీసుకుని వెళ్లి ఆటలకోసం వెళ్లేవారు ఇటీవల పెరిగి పోయారు.

'జూదం ఆడటం మన సంస్కృతి కాదు.. దీని కారణంగా కుటుంబాలు వీధిన పడుతున్నాయి.. రాష్ట్రంలో జూదాన్ని నిషేధిస్తున్నాం.'.. అంటూ 2014లో నాటి సీఎం కేసీఆర్ ప్రకటించటంతో పాటుగా రాష్ట్రంలోని చాలా క్లబ్‌లను మూసి వేయించారు. అయితే ఇటీవల జూదగాళ్లు తిరిగి తమదైన శైలిలో రెచ్చిపోతున్నారు. జోరుగా 'అందర్ బహర్' పేరుతో జూదం నిర్వహిస్తుండగా తెలంగాణ, ఏపీలోకి ఆయా ప్రాంతాల నుంచి ఆటగాళ్లు నిత్యం సరిహద్దుల్లోని తోటల్లో, ఖాళీ భవనాల్లో ఆటలు సాగిస్తున్నారు.

సూర్యాపేట జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు, ఏపీలోని జగ్గయ్యపేటకు



చెందిన ఒకరు ముఠాగా ఏర్పడి అత్యంత గుట్టుగా జూదం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని మిర్యాలగూడ, నాగార్జునసాగర్, నల్గొండ, నకిరేకల్, సూర్యాపేట, హుజూర్‌నగర్, దేవరకొండ నియోజకవర్గాల నుంచి నిత్యం ఆటగాళ్లు వెళుతున్నారు. వారు తమ కార్లలో హుజూర్‌నగర్, కోదాడ, మేళ్లచెర్వు ప్రాంతాలకు వెళ్లగానే.. వాటిని పెట్రోల్‌బంక్‌లు, సినిమా థియేటర్లు, శివారు ప్రాంతాల్లో పార్కింగ్ చేయిస్తారు. నిర్వాహకుల తరఫు మనుషులు వచ్చి ఆటగాళ్ల చరవాణులు స్వాధీనం చేసుకుని, వారి నుంచి డబ్బులు తీసుకుని టోకెన్లు ఇస్తారు. రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.50 వేలు టోకెన్లు ఇస్తూ ఆట స్థలాల్లో డబ్బులు లేకుండా కేవలం టోకెన్లతో ఆటలు నిర్వహిస్తున్నారు. అక్కడి నుంచి ఆటగాళ్లను ఆట జరిగే ప్రాంతానికి తరలిస్తారు. సాయంత్రం ఆట పూర్తికాగానే తిరిగి వెళ్లే సమయంలో వారి వద్ద ఉన్న టోకెన్ల ఆధారంగా వారి డబ్బులు తిరిగిచ్చేస్తారు. మూడు రోజులకు ఒక ఆట స్థావరం మార్చుతున్నారు.

ప్రత్యేకంగా టెంట్లు, భోజనం, మద్యం వసతి కల్పిస్తూ ఆటగాళ్లను నిర్వాహకులు ప్రోత్సహిస్తున్నారు. ఆటకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు 'కేట్' పేరుతో నిర్వాహకులు వసూలు చేస్తూ.. రోజుకు లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ఆటలు జరిగే ప్రాంతానికి వెళ్లే మార్గంలో తమ సిబ్బందిని నిఘా పెట్టి కార్లలో, ఇతర వాహనాల్లో పోలీసులు బయటి వ్యక్తులు ఎవరైనా వస్తే సెల్‌ఫోన్‌లతో ఫొటోలతో సహా సమాచారం ఇచ్చేలా ఏర్పాటు చేసుకుంటున్నారు.

# విద్యార్థులకు రాగిజావ

జగిత్యాల : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు పోషకాహార లోపంతో బాధపడొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం రాగిజావ అందించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే మధ్యాహ్న భోజన మెనూలో వెజిటబుల్ బిర్యానిని చేర్చగా, ఉదయం రాగిజావ అందించేలా చర్యలు చేపట్టింది. చాలామంది పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తుండగా ఉదయం వచ్చే సమయంలో ఖాళీ కడుపుతో వస్తున్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు అల్పాహారం తీసుకోవడంలేదు. ఫలితంగా రక్తహీనత, పోషకాహార లోపంతో కనిపించడంతోపాటు తరగతి గదుల్లో నీరసంగా, అనాసక్తిగా కనిపిస్తున్నారు. ఈ సమస్యను నివారించేందుకు ఉదయం విరామ సమయంలో రాగిజావ అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 20న జరిగే విద్యా దినోత్సవం నుంచే కొత్త కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఇప్పటికే విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. దీనికి అనుగుణంగా జిల్లాలోని 753 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 65 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందించేలా కార్యాచరణ రూపొందించారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అమలు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు బెంగళూరు కేంద్రంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సత్యసాయి అన్నపూర్ణ



ట్రస్టు జగిత్యాల ఆధ్వర్యంలో దాదాపు 320 పాఠశాలల్లో చదివే 32 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నారు. 2015లో జగిత్యాలలోని మోతె గ్రామ శివారులోని నాగేంద్రనగర్ కాలనీలో 50 మంది విద్యార్థులకు పాలు, హార్లిక్స్‌తో కార్యక్రమాన్ని ప్రారంభించగా ప్రస్తుతం గత ఏప్రిల్ వేసవి సెలవుల వరకు దాదాపు 50 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందించేలా చూశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సహకారంతో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా పాఠశాల సెలవుల్లో మిగిలిపోయిన రాగి జావ పౌడర్‌ను జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులు, రజకులు దాదాపు 1670 కుటుంబాలకు కిలో చొప్పున అందించారు. ఇందులో జగిత్యాలలో 350 పారిశుద్ధ్య, 700 రజక, మెట్‌పల్లి, జమ్మికుంటలో 300 కుటుంబాల చొప్పున పారిశుద్ధ్య కుటుంబాలకు అందించారు.

పేద పిల్లలకు ప్రయోజనకరం

గోవర్ధన ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు

ఉదయం పూట ఖాళీ కడుపుతో వచ్చే విద్యార్థులకు రాగిజావ అందించడం మంచి నిర్ణయం. ఇప్పటికే పలు పాఠశాలల్లో అన్నపూర్ణ సత్యసాయి ట్రస్టు ద్వారా రాగిజావ అందిస్తున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని నిర్ణయించడంతోపాటు మధ్యాహ్న భోజన మెనూలోనూ వెజిటబుల్ బిర్యానిని చేర్చారు. దీంతో విద్యార్థులకు పోషకాహారం అంది చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపే అవకాశంతో పాటు విద్యార్థుల సంఖ్య కూడా పెరగనుంది.

జిల్లాలో పంపిణీ చేస్తున్నాం

ఊటూరి శ్రీకాంత్, ట్రస్టు రీజినల్ సమన్వయ కర్త

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఏ విద్యార్థి పోషకాహార లోపంతో బాధపడకూడదని ఇప్పటికే పలు పాఠశాలల్లో రాగిజావ అందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా దాదాపు 500 పాఠశాలల్లో 50 వేల మంది విద్యార్థులకు గతేడాది చివరి వరకు అందించేలా చూశాం. వేసవి సెలవుల్లో మిగిలిన రాగిజావ పౌడర్‌ను జిల్లాలోని దాదాపు వెయ్యికి పైగా పారిశుద్ధ్య, రజక కుటుంబాలకు అందించాం. ప్రస్తుతం ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా అందించేలా ట్రస్టు ఆలోచన చేస్తుంది.

# పైపైనే జలం.. సాగుకు బలం

జగిత్యాల : యాసంగి ముగిసి వానాకాలం పైర్లసాగు ముంగిట జిల్లాలోని మండలాల్లో లభ్యతగల భూగర్భ జలాలు అన్నదాతలకు ఆశాజనకంగా మారాయి. 2022 మే నెలాఖరున 5.81 మీటర్ల లోతుతో పోలిస్తే ప్రస్తుతం భూగర్భ జలాలు మరింత పైనే 5.51 మీటర్ల సరాసరి లోతులో ఉండటం పైర్లసాగుకు ఉపకరించనుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాలోని ఆయకట్టుకు ఏప్రిల్ వరకు నీటిని వదలగా వరద కాలువలోకి కూడా పలు దఫాలుగా నీటిని విడుదల చేశారు. దీంతోపాటు కాకతీయ, వరదకాలువలు, ఇతర డిస్ట్రిబ్యూటరీల నుంచి కూడా చెరువులు, కుంటల్లోకి నీటిని విడుదల చేయటంతో వేసవి ముగిసినా చాలా నీటి వనరులు జలంతోనే నిండి ఉన్నాయి. వాగులు, ఒర్రెల్లోనూ నీరు పారుతుండగా భూగర్భ జలమట్టం పైపైనే ఉండి నెలరోజులు ముందుగా పంటలను సాగుచేయాలన్న ప్రభుత్వ సూచనకు దోహదకారిగా మారింది.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.726 టీఎంసీల నీరు నిలువుంది. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా ఎల్లంపల్లి నుంచి జలాలను ఎత్తిపోసి వరద కాలువలో నిండుగా నిల్వచేసే వీలుండటం, సగటు భూగర్భ జలమట్టం 5.51 మీటర్లుగా ఉండటం వానాకాలం పైర్లసాగుకు కలిసిరానుంది. కాలువలతో పాటుగా బావులు, బోర్లలోనూ సమృద్ధిగా నీరుండగా మోటార్ల ద్వారా నీటిని తోడుకునే వీలుండటంతో వరినార్లకు అవకాశం కలిగింది. ప్రస్తుతం కనిష్ఠ స్థాయిలో భూగర్భ జలాలుండటంతో 1.27 లక్షల పంపుసెట్ల ఆధారితంగా జిల్లాలో పైర్లసాగుకు అవకాశం ఏర్పడిందని భూగర్భ జలవనరులశాఖ జిల్లా అధికారి జి.నర్సింహులు పేర్కొన్నారు. ఈ వానాకాలంలో 4.43 లక్షల ఎకరాల్లో ఆహార, ఉద్యాన పంటలు సాగులోకి వస్తాయని అధికారులు అంచనా వేయగా ఇందులో అత్యధికంగా 2.98 లక్షల ఎకరాల్లో వరిని పండించనున్నారు. ఇప్పట్నుంచి జులై నెలాఖరు వరకు పెద్దఎత్తున వరినార్లు పోసి సెప్టెంబరు వరకు వరినాట్లు వేస్తారు కాబట్టి వీరికి జల లభ్యత ఎంతో ఉపయుక్తంగా మారనుంది. కాళేశ్వరం నుంచి ఎత్తిపోతలతో ప్రాజెక్టుల నీటి లభ్యత, భూగర్భ జలాల అందుబాటుతో రైతులు వానాకాలం పంటలను సాగు చేసేందుకు సన్నద్ధమవుతుండగా ప్రకృతి కరుణించి సమృద్ధి వర్షాలు కురిసి, ఎల్లంపల్లి నుంచి ఎస్సారెస్పీలోకి ఎత్తిపోతలు సిద్ధిస్తే ఈ సీజన్‌లోనూ రైతులు మెండైన పంటలను సాగుచేయగలుగుతారు.

# కళ కోల్పోతున్న రింగ్ రోడ్డు కూడళ్లు



ఖమ్మం : మూడు వైపులా త్రిభుజాకార ఐలాండ్‌లు, పచ్చని మొక్కలు, ఫౌంటెయిన్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రధాన కూడలిగా ఉన్న తల్లాడ రింగురోడ్డు అది. ఇక్కడి నుంచి భద్రాచలం, ఖమ్మం, సత్తుపల్లి నుంచి రాజమహేంద్రవరం, వైజాగ్ ఇలా మూడు వైపులకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం ఆ కూడలి నిర్వహణ లోపంతో వెలవెలబోతోంది. ఆ నిర్మాణాలు గత ప్రాభవానికి గురుతులుగానే మిగులుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి కూడలిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సైతం రెండేళ్ల క్రితం ప్రకటించారు. అది కూడా కార్యరూపం దాల్చలేదు.

భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసం

రింగురోడ్డు నుంచి మూడువైపులా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వైజాగ్‌కు పెద్దపెద్ద యంత్రాలను తరలించే లారీలు, కాకినాడకు భారీ గ్రానైట్ రాళ్లను రవాణా చేసే వాహనాలు మలుపుతిరిగే సమయంలో రింగురోడ్డు గోడలు, ఇనుప గ్రిల్స్, దిమ్మెను తాకుతూ వెళ్లడంతో అవి విరిగిపోతున్నాయి. త్రిభుకార ఐలాండ్‌కు రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప జాలీలు పూర్తిగా విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఆ జాలీల్లో నీరు లేక మొక్కలు ఎండిపోతున్నాయి. విద్యుత్తు దీపాలు సరిగా వెలగక అంధకారంగా మారింది. తల్లాడ పంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలిక విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేసినా వాటి వెలుగులు సరిపోవడం లేదు.

దారిలో కలిసిన డివైడర్

తల్లాడ–దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారిలో తల్లాడ బస్టాండ్ నుంచి ఉన్నత పాఠశాల వరకు డివైడర్ ఉంది. ప్రతి సంవత్సరం రహదారులు నిర్మిస్తుండటంతో రోడ్డు ఎత్తు పెరిగి డివైడర్‌కు సమానమైంది. వాహనదారులు డివైడర్‌పై నుంచీ రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తల్లాడ రింగురోడ్డుకు పూర్వవైభవం తీసుకురావాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రహదారి విస్తరించి.. డివైడర్లు విస్మరించి

మధిర–విజయవాడ రోడ్డులో ఎర్రుపాలెంలోని ప్రధానమైన రింగ్ కూడలిలో రహదారి విస్తరించిన అధికారులు ఆ మేరకు సౌకర్యాలు కల్పించకపోవటంతో వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. విజయవాడకు ప్రధాన రహదారి కావటంతో వాహనాల రద్దీ పెరుగుతోంది. మధిర, విజయవాడ వైపు ఉన్న రహదారుల్లో డివైడర్లు ఏర్పాటు చేయకపోవటంతో వేగంతో వచ్చి తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక రింగ్‌లో ఫౌంటెయిన్ నిర్మించకుండా వదిలేశారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి నిధులు కేటాయించి, డివైడర్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలు పడగానే తల్లాడ రింగురోడ్డు కూడలిలో మొక్కలు నాటి అందంగా తీర్చిదిద్దుతాం. అవకాశం ఉంటే తల్లాడ రింగురోడ్డు కూడలిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. తల్లాడ–దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారిలో రింగురోడ్డు కూడలి ఉన్నది. ఈ రింగురోడ్డును అభివృద్ధి చేయాల్సిన బాధ్యత జాతీయ రహదారి అధికారులదే. ఆ అధికారులు రింగురోడ్డు కూడలి గురించి పట్టించుకోవడం లేదు. గ్రామపంచాయతీకి సంబంధం లేదు. బి.రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ, తల్లాడ

# ప్రభుత్వ, పరిశ్రమ భూముల్లో ఆక్రమణలు



గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విలువైన భూములు ఆక్రమార్కుల చేతుల్లో వెళ్తున్నాయి. ప్రభుత్వ భూములతో పాటు పరిశ్రమల ఏర్పాటు కోసం సేకరించిన స్థలాలకు హద్దుల ఏర్పాటు లేకపోవడంతో పాటు పట్టామార్పిడి చేసుకోకపోవడాన్ని కబ్జాదారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. విలువైన భూములను సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. రామగుండం ప్రాంతంలో పేదల అవసరాల కోసం ప్రభుత్వం సేకరించిన భూమిని కొందరు దళారులు దర్జాగా కబ్జా చేస్తూ విక్రయించుకుంటున్నారు. రహదారి కోసం సింగరేణి సంస్థ సేకరించిన భూమిని దక్కించుకోవడానికి రహదారి వెడల్పును తగ్గించి మరీ మిగతా భూమిని ఆక్రమించుకుంటున్నారు. పేదప్రజల ఇళ్ల కోసం ప్రభుత్వం సేకరించిన 100 ఎకరాల భూమిలో సైతం పాగా వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొందరు అందులో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు హద్దులు సైతం ఏర్పాటు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా వారి దందాకు అడ్డుకట్ట పడటం లేదు. తాజాగా సింగరేణి సంస్థ రహదారి కోసం సేకరించిన భూమిని కూడా దక్కించుకోవడానికి కొందరు వ్యూహాలు పన్నుతున్నారు.

పేదల ఇళ్లకోసం సేకరిస్తే...

ప్రభుత్వం పేద ప్రజల ఇళ్ల కోసం మేడిపల్లి శివారులో 100 ఎకరాల భూమిని సేకరించింది. ఒక ఎకరాకు రూ.5 లక్షల చొప్పున చెల్లించిన ప్రభుత్వం వంద ఎకరాలు సేకరించి న్యూ పీకే రామయ్యకాలనీ, ఇందిరమ్మకాలనీల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. ప్రస్తుతం అందులో 15 ఎకరాలు ఖాళీగా ఉండటంతో అక్రమార్కులు దానిపై కన్నేశారు. అందులో ఇళ్ల నిర్మాణాలకు స్థలాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మేడిపల్లి శివారులోని 17 సర్వే నెంబర్ల నుంచి వంద ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఒక సర్వే నెంబరులో ఉన్న తప్పును కొంతమంది అనుకూలంగా మలుచుకుని సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని ప్లాట్లను విక్రయించిన దళారులు తమ దందాను కొనసాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులు కూల్చివేసినా కొద్ది రోజులు దందాను నిలిపివేసి మళ్లీ మొదలు పెడుతున్నారు. దీంతో విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నాయి.

రహదారి పక్కన...సింగరేణి సంస్థ రహదారి కోసం సేకరించిన భూమిని సైతం అక్రమార్కులు వదలడం లేదు. వంద ఫీట్ల రహదారి నిర్మాణం కోసం సింగరేణి సంస్థ 13.12 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. దీనికి సంబంధించి సేకరించిన భూమికి పరిహారం చెల్లించింది. పట్టా మార్పిడి చేసుకోకపోవడంతో ఆ స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. మేడిపల్లి నుంచి రామగుండం వెళ్లేందుకు ఏర్పాటు చేసే లింకు రోడ్డును 30 ఫీట్లకు కుదించి మిగతా స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు. ఎంతో విలువైన భూమిని అక్రమార్కులు తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. సింగరేణి విస్తరణ కోసం గతంలో సేకరించిన భూముల్లో సైతం అక్రమ దందా కొనసాగుతున్నట్లు సమాచారం. ఓసీపీ–5 కోసం సేకరిస్తున్న భూమిలో కూడా గతంలో సంస్థ పరిహారం చెల్లించిన భూములకే మళ్లీ చెల్లించే పరిస్థితి ఏర్పడింది. జనగామ, సుందిళ్ల, ముస్త్యాల గ్రామాల పరిసర ప్రాంతాల్లో భూమి రికార్డులు లేకపోవడంతో మళ్లీ వాటికే పరిహారం చెల్లించే పరిస్థితి. భూసేకరణ సమయంలో పట్టా మార్పిడి చేసుకోకపోవడంతో సంస్థ భూములకు రక్షణ లేకుండా పోతుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ఆయా అంశాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

# పర్యవేక్షణ కొరవడి.. పనులు తడబడి

ఇల్లెందు : వృథాగా కిందకు ప్రవహించే వర్షపు నీటికి అడ్డుకట్ట వేయడంతో పాటు పరిసరాల్లో భూగర్భ జలాలు పెంపొందించడమే చెక్‌డ్యాంల లక్ష్యం. ఈ నేపథ్యంలో 2020–21 సంవత్సరంలో ఫేజ్–1లో భాగంగా ఉమ్మడి జిల్లాలో 77 చెక్ డ్యాంల నిర్మాణానికి నాబార్డు రూ.207.69 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 14,670 ఆయకట్టుకు నీరందుతుందని అంచనా రూపొందించారు. డ్యాంల నిర్మాణాలు పూర్తయ్యాయి కానీ, అనుబంధంగా చేపట్టాల్సిన చివరి పనులు చేపట్టకపోవడంతో ఈ సీజన్‌లోనూ వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. గుత్తేదారుల అశ్రద్ధ, అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణంగా నిలుస్తోంది. చెక్‌డ్యాంల వద్ద డౌన్‌స్ట్రీమ్ బెడ్ పిచింగ్, రివిట్‌మెంట్‌లు, గైడ్‌వాల్స్, సైడ్‌బండ్స్ నిర్మిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

రైతులకు కొత్త కష్టాలు..బెడ్ పిచింగ్‌లు నిర్మించకపోవడంతో వాగు దాటి పంట పొలాలకు వెళ్లేందుకు, సైడ్‌బండ్స్, గైడ్‌వాల్స్ నిర్మించకపోవడంతో వాగు పొంగిన సమయాల్లో సమీప పొలాలు కోతకు గురవుతున్నాయి. దీంతో ఏమి చేయాలో తోచక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరువైపులా రివిట్లు కూడా నిర్మించకపోవడంతో వాగు ఉద్ధృతి ధాటికి ఒడ్డు కోతకు గురవుతూ సమీప పొలాల్లోకి వరద



పోటెత్తుతోంది. ఉదాహరణకు టేకులపల్లి మండలం ముక్కమడుగుపై 2020–21లో చేపట్టిన చెక్‌డ్యాం పనులు కొద్ది రోజుల క్రితం పూర్తయ్యాయి. డౌన్‌స్ట్రీమ్ బెడ్ పిచింగ్ చేయకపోవడంతో వాగు ఒడ్డుకు వెళ్లేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. నీళ్లు నిలిచి అరకలు, ఎరువులు ఒడ్డు అవతలి వైపు తీసుకెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. మూడేళ్లుగా ఇదే సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

చివరి బిల్లులు నిలిపేశాంచెక్‌డ్యాం స్ట్రక్చర్‌ల నిర్మాణాలు వందశాతం పూర్తయ్యాయి. పది చెక్‌డ్యాంలకు సంబంధించిన తుదిదశ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. చివరి బిల్లులు నిలిపివేయడంతో పాటు గుత్తేదారులకు నోటీసులు ఇచ్చాం. వాగుల్లో నీటి ప్రవాహం కారణంగా అసంపూర్తి పనులు చేపట్టే అవకాశం లేదు. వీలైన సమయాల్లో పూర్తిచేయిస్తాం. శంకర్‌నాయక్, సీఈ,జలవనరుల శాఖ

# తాగునీటి గండం

ఖమ్మం : తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి గండం తరుముకొస్తోంది. మూడు జిల్లాల్లోని మిషన్ భగీరథ పథకాలకు ముప్పు పొంచి ఉంది. పాలేరు జలాశయంలో జల లభ్యత ఆధారంగా ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు మిషన్ భగీరథ పథకాలు నిర్మించారు. ప్రస్తుతం పాలేరు జలాశయంలో నీటిమట్టం అడుగంటుతోంది. ఈ రిజర్వాయర్‌కు సాగర్ జలాలు విడుదల చేసి మిషన్ భగీరథ పథకాలకు నీరందేలా చూడాలని ఎస్ఈ సదాశివకుమార్ ఖమ్మంలోని జలవనరులశాఖ సీఈ శంకర్‌నాయక్‌కు లేఖ అందించారు. జిల్లాలో తాగునీటి అవసరాలు తీరేలా సాగర్ జలాలు విడుదల చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సీఈ తెలిపారు.

పాలేరు నుంచి మూడు జిల్లాలకు..

పాలేరు రిజర్వాయర్ నుంచి కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, తిరుమలాయపాలెం, ఖమ్మం గ్రామీణం, రఘునాథపాలెం మండలాల్లోని 359 ఆవాస ప్రాంతాలు, ఖమ్మం కార్పొరేషన్‌కు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరందిస్తున్నారు. పాలేరు జలాశయం ఇన్‌టెక్ వెల్ నుంచి నీటిని తీసుకుని జీళ్లచెర్వు వద్ద శుద్ధిపరిచి ప్రధాన పైపులైన్ ద్వారా సరఫరా చేస్తున్నారు. పాలేరు రిజర్వాయర్ నుంచి మహబూబాబాద్ జిల్లాకు నీటిని అందించేందుకు తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం వద్ద నీటిశుద్ధి కేంద్రాన్ని నిర్మించారు. అక్కడి



నుంచి 1,686 ఆవాస ప్రాంతాలు, ఐదు మున్సిపాలిటీలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఈ రిజర్వాయర్ నుంచి సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు 389 ఆవాస ప్రాంతాలకు తాగునీటిని అందిస్తున్నారు. ఇన్‌టెక్ వెల్‌లో పూడిక పేరుకుపోవడంతో మోటార్లకు నీరందని పరిస్థితి ఏర్పడింది. పాలేరు, నర్సింహులగూడెం, కిష్టాపురం, జుజ్జులరావుపేట, నాయకన్‌గూడెం, ఈశ్వరమాదారం, రాజుపేట ప్రాంతాల్లోని 33 గ్రామాలకు మరో మోటారు ద్వారా తక్కువ పరిమాణంలో నీటిని సరఫరా చేస్తున్నారు.

రోజుకు 125.6 క్యూసెక్కుల నీరు అవసరం

పాలేరు రిజర్వాయర్ నుంచి మూడు జిల్లాల్లోని మిషన్ భగీరథ పథకాలకు రోజుకు 125.6 క్యూసెక్కుల నీరు అవసరం. 11 ఎంసీఎఫ్‌టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్స్) జలాలు కావాలి. పాలేరులో ప్రస్తుతం ఉన్ననీరు 15 రోజులకు సరిపోతుంది. ఈ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు. శుక్రవారం నాటికి 11.8 అడుగుల వరకు నీరుంది. 11 అడుగుల కిందికి దిగితే మిషన్ భగీరథ పథకాలకు నీరందదు. మిషన్ భగీరథ అధికారులు ఆందోళన చెందుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో 519.4 అడుగుల నీరుంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తే పాలేరు జలాశయానికి చేరేందుకు కనీసం మూడు రోజులు పడుతుంది. సాగర్ ఎడమ ప్రధాన కాల్వపై ఎగువ ప్రాంతంలో అత్యవసర మరమ్మతులు జరుగుతున్నాయి. నీటిని విడుదల చేయాలంటే మరమ్మతులు నిలిపేయాల్సిందే.

తాగునీటి అవసరాలు తీర్చేందుకు సాగర్ జలాలు విడుదల చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారులకు లేఖ రాశాం. సాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలంటే ఎగువ ప్రాంతంలో కొన్నాళ్ల పాటు మరమ్మతులు నిలిపేయాలి. మరో 15 రోజులకు సరిపడా తాగునీరు మాత్రమే పాలేరు జలాశయంలో ఉంది. సాగర్ జలాల సరఫరాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. శంకర్ నాయక్, సీఈ, జలవనరుల శాఖ, ఖమ్మం

# గింజలు మొలవక.. ఆశలు చావక!

ఖమ్మం: అన్నదాతలకు వానాకాలం పరీక్ష పెడుతోంది. తొలకరి పలకరింపుతో కొండంత ఆశతో సాగు పనులు మొదలుపెట్టినా క్రమేణా వర్షాలు ముఖం చాటేస్తుండటంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు మొలకెత్తని కొన్నిచోట్ల రెండోసారి, మూడోసారి మళ్లీ గింజలు వేస్తున్నారు. ఆదిలోనే హంసపాదు అన్నట్లు రైతులకు విత్తన భారం తప్పటం లేదు.

భద్రాద్రి జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటివరకు మొత్తంమ్మీద 91,071 (ప్రధానంగా పత్తి- 45,972, వరి- 5,057, మొక్కజొన్న- 4,945) ఎకరాలు, ఖమ్మం జిల్లాలో మొత్తంమ్మీద 1,43,890 (ప్రధానంగా వరి- 50,704, పత్తి- 87,985, పెసర-4443, మొక్కజొన్న- 326) ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి.

పత్తి రైతులకు విపత్తు..

మే ఆఖరు నుంచే రైతులు పత్తి సాగుకు పూనుకున్నారు. జూన్‌లో తొలకరి పలకరింపుతో ఎక్కువ మంది విత్తనాలు వేశారు. ఆ తర్వాత ఆశించిన మేరకు వానలు కురకవపోవటంతో 30–40 శాతం గింజలు మాత్రమే మొలిచాయి. ఉభయ జిల్లాల్లో ఇప్పటివరకు 1,33,957 ఎకరాల్లో పత్తి సాగైతే సుమారు 85వేల ఎకరాల్లో గింజలు మొలకెత్తలేదు. రైతులు మరోసారి విత్తనాలు నాటుతున్నారు. ఎకరాకు గింజలు వేసేందుకు సుమారు రూ.10 వేలు వెచ్చించాలి. దుక్కి దున్నేందుకు రూ.4వేలు ఖర్చు చేయాలి. రెండోసారి విత్తనాలు నాటితే ఎకరాకు అదనంగా రూ.10వేల పెట్టుబడి అవసరమవుతుంది. ఒకట్రెండు సార్లు గింజలు నాటడం వల్ల మొక్కల చుట్టూ పిచ్చిగడ్డి మొలుస్తుంది. దీన్ని తొలగించేందుకూ అదనపు ఖర్చు తప్పదు.

ఐదెకరాలు కౌలు తీసుకుని పత్తి సాగు చేస్తున్నా. తొలుత కురిసిన వానలకు గింజలు నాటాను. ఎకరాకు రూ.10వేల చొప్పున రూ.50వేలు ఖర్చయ్యింది. వానలు లేక విత్తనాలు మొలకెత్తలేదు. రెండోసారి గింజలు పెడుతున్నా. పెట్టుబడి రెట్టింపవుతోంది. ఆకాశంలో మబ్బులు ఊరిస్తున్నా వర్షాలు కురవటం లేదు. అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టాను. ఏం చేయాలో పాలుపోవటం లేదు. గోపయ్య, చింతగుర్తి, రఘునాథపాలెం మండలం

ఐదెకరాల్లో పత్తి సాగు చేస్తున్నా. సీజన్ మొదట్లో కురిసిన వానకు విత్తనాలు పెట్టాం. దుక్కిదున్నడం, విత్తనాలు, కూలీల ఖర్చు కలిపి ఎకరాకు రూ.15 వేల చొప్పున రూ.75వేల వరకు పెట్టుబడి పెట్టాను. వానలు లేక గింజలు మొలకెత్తలేదు. మళ్లీ దుక్కి దున్ని రెండోసారి విత్తనాలు వేస్తున్నాను. ఈసారి రూ.50 వేల వరకు ఖర్చవుతుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో అదనపు భారం తప్పటం లేదు. చందూలాల్, పరికలబోడుతండా, రఘునాథపాలెం మండలం

## "ప్లీజ్ గివ్ డేట్స్ అమ్మ" కీర్తి కి ట్వీట్ చేసిన హీరో

కీర్తి సురేష్ తమిళ్ తో పాటు బాలీవుడ్ లో కూడా సినిమాలు కమిట్ అవుతూ బిజీగా ఉన్న విషయం తెల్సిందే. ఈ మధ్య కాలంలో ఎక్కువగా తమిళ సినిమాలతో బిజీగా ఉంటున్న ఈ అమ్మడు వరుణ్ దావన్ సినిమా షూటింగ్ లో పాల్గొనేందుకు రెడీ అవుతోంది. తాజాగా కీర్తి సురేష్ చీర కట్టు లో ఫోటోలను షేర్ చేసింది. న్యూ బిగినింగ్ అంటూ వరుణ్ దావన్ కొత్త సినిమా హ్యాష్ ట్యాగ్ ను షేర్ చేసింది. దాంతో కీర్తి సురేష్ కు వరుణ్ దావన్ రిక్వెస్ట్ గా ప్లీజ్ గివ్ డేట్స్ అమ్మ (దయచేసి డేట్స్ ఇవ్వు అమ్మ) అంటూ కామెంట్ పెట్టాడు. కీర్తి సురేష్ పెట్టిన పోస్ట్ కు వరుణ్ దావన్ కామెంట్ చేయడం అందరి దృష్టిని ఆకర్షింది. కొద్ది నిమిషాల్లోనే ఆ కామెంట్ వైరల్ అయ్యింది. కీర్తి సురేష్ పాపం బాలీవుడ్ సినిమాలకు డేట్లు ఇవ్వడం లేదా.. వరుణ్ దావన్ చాలా రోజులుగా కీర్తి సురేష్ డేట్ల కోసం వెయిట్ చేస్తున్నాడా అంటూ పలువురు పలు రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. అట్లీ నిర్మాణంలో కలీస్ దర్శకత్వంలో వరుణ్ దావన్ హీరోగా కీర్తి సురేష్ మరియు వామికా గబ్బి హీరోయిన్స్ గా సినిమా రూపొందుతోంది.



ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేసి కొంత మేరకు షూటింగ్ కూడా జరిగిందనే వార్తలు వస్తున్నాయి. కానీ కీర్తి సురేష్ బిజీగా ఉండటం వల్ల డేట్లు ఇవ్వలేక పోతుందేమో అని వరుణ్ దావన్ కామెంట్ ని చూస్తే అనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తెలుగులో ఈ మధ్య కాలంలో కీర్తి సురేష్ పెద్దగా ఆఫర్లు దక్కించుకోలేక పోతుంది. కానీ తమిళంలో మాత్రం రెగ్యులర్ గా సినిమాలు చేస్తూనే ఉంది. చేతిలో పెద్దగా సినిమాలు లేకున్నా కూడా ఎందుకు కీర్తి సురేష్ డేట్లు ఇవ్వడంలో విఫలం అవుతుంది అంటూ కొందరు వరుణ్ దావన్ కి మద్దతుగా కీర్తి సురేష్ పై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వరుణ్ దావన్ కామెంట్ కి కీర్తి సురేష్ ఎలా రియాక్ట్ అవుతుందా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సోషల్ మీడియాలో మొత్తానికి వరుణ్ దావన్ మరియు కీర్తీ సురేష్ సినిమాకు సంబంధించిన పోస్ట్, కామెంట్ వైరల్ అవుతోంది.

## ఫెస్టివల్ ఫైట్ మరింత టఫ్ చేస్తున్న ప్రభాస్..!

ప్రభాస్ సినిమాల లైనప్ ఎలా ఉందో తెలిసిందే. లాస్ట్ ఇయర్ డిసెంబర్ లో సలార్ 1 అంటూ వచ్చి మాస్ హిట్ అందుకున్న ప్రభాస్ ఆ సినిమా తర్వాత కల్కి 2898%ూణ%తో ఈ సమ్మర్ వచ్చేందుకు రెడీ అయ్యాడు. నాగ్ అశ్విన్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాను వైజయంతి మూవీస్ బ్యానర్ లో అశ్వినీదత్ 500 కోట్ల బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ గురించి త్వరలో క్లారిటీ రావాల్సి ఉంది. ఇక దీనితో పాటు ప్రభాస్ రాజా సాబ్ చేస్తున్నాడు. మారుతి డైరెక్షన్ లో ప్రభాస్ నుంచి వస్తున్న ఎంటర్టైనర్ సినిమాగా రాజా సాబ్ వస్తుంది. ప్రభాస్ ని వింటేజ్ లుక్ తో వచ్చిన రాజా సాబ్ ఫస్ట్ లుక్ ఫ్యాన్స్ ని థ్రిల్ చేసింది. ప్రభాస్ ని ఒకప్పటి




ఎనర్జిటిక్ పాత్రలో చూపించడానికి మారుతి ప్రయత్నిస్తున్నాడు. థ్రిల్లర్ కథాంశంతో వస్తున్న ఈ సినిమా విషయంలో మారుతి ప్లాన్స్ నెక్స్ట్ లెవెల్ లో ఉన్నటు తెలుస్తుంది. సినిమా ఇప్పటివరకు 60 శాతం పూర్తి కాగా రానున్న నాలుగు నెలల్లో సినిమాను మాక్సిమం పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అయితే ఈ గ్యాప్ లో సలార్ 2 కి కూడా డేట్స్ ఇచ్చే ప్లానింగ్ లో ఉన్నాడు ప్రభాస్. సలార్ 2 ఏమో కానీ ప్రభాస్ రాజా సాబ్ ని ఈ ఇయర్ ఎండింగ్ కల్లా రిలీజ్ చేసేలా చూస్తున్నారని టాక్ రాగా లేటెస్ట్ గా డిసెంబర్ నుంచి ప్రభాస్ రాజా సాబ్ నెక్స్ట్ సంక్రాంతికి టార్గెట్ పెట్టారని తెలుస్తుంది. ప్రభాస్ సినిమా సంక్రాంతికి వస్తే ఆ లెక్క వేరేలా ఉంటుంది. రాజా సాబ్ సినిమాను మాక్సిమం పొంగల్ రేసులో దించేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. రాజా సాబ్ సినిమా సంక్రాంతికి పర్ఫెక్ట్ మూవీ అని.. రెబల్ స్టార్ ఫ్యాన్స్ తో పాటుగా ఆడియన్స్ కి స్పెషల్ ట్రీట్ అందిస్తుందని అంటున్నారు. అయితే నెక్స్ట్ సంక్రాంతికి ఆల్రెడీ మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర రిలీజ్ అనౌన్స్ చేయగా.. నాగ చైతన్య తండేల్, శర్వానంద్ సినిమాలు కూడా సంక్రాంతికే వస్తున్నాయి. వీటితో పాటుగా నాగార్జున కూడా ఎవరొచ్చినా సరే సంక్రాంతికి నేను రెడీ అంటున్నాడు. సో ఈ పొంగల్ ఫైట్ లో ప్రభాస్ రాజా సాబ్ కూడా ఉంటుందని చెప్పుకుంటున్నారు. సో నెక్స్ట్ సంక్రాంతి కూడా మరోసారి బిగ్ ఫైట్ తప్పేలా లేదు.




## అల్లు స్నేహ ఫస్ట్ డంప్.. మెగా కోడళ్లతో అలా.. ఫ్రెండ్స్ తో ఇలా



టాలీవుడ్ స్టార్ హీరోల భార్యల్లో కొందరు మాత్రమే సోషల్ మీడియా లో యాక్టివ్ గా ఉంటారు. మహేశ్ బాబు భార్య నమ్రత, రామ్ చరణ్ సతీమణి ఉపాసన, అల్లు అర్జున్ భార్య స్నేహా రెడ్డితో పాటు ఇంకొందరు రెగ్యులర్ గా సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను షేర్ చేస్తుంటారు. వారిలో అల్లు స్నేహకు ఇన్ స్టాలో 9 మిలియన్ల మంది ఫాలోవర్స్ ఉన్న సంగతి తెలిసిందే. తరచూ అల్లు అర్జున్, కొడుకు అయాన్, కూతురు అర్హ ఫొటోలను షేర్ చేస్తుంటారు స్నేహ. వారికి సంబంధించిన విషయాలను రెగ్యులర్ గా పంచుకుంటూ ఉంటారు. ఇటీవల అల్లు స్నేహ తన పేరెంటింగ్ మంత్ర అంటూ ఓ వీడియో షేర్ చేశారు. అందులో ముఖ్యంగా 6 పాయింట్స్ చెప్పారు. అయితే స్నేహా రెడ్డి షేర్ చేసిన వీడియో ఇప్పటికీ వైరల్ గా ఉంది. తాజాగా అల్లు స్నేహ మరో ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టారు. జనవరి డంప్ పేరుతో ఈ మంత్ లో తన స్పెషల్ పిక్స్ ను షేర్ చేశారు. లవ్లీ పర్సన్స్ తో ఈ సంవత్సరం స్టార్ట్ చేసినట్లు తెలిపారు. న్యూ ఇయర్ పార్టీలో మెగా కోడళ్లు ఉపాసన, లావణ్య త్రిపాఠితో స్టైలిష్ గా దిగిన పిక్ ను షేర్ చేశారు. మరో పిక్ లో కూతురు అర్హతో క్యూట్ గా పోజు ఇచ్చారు. ఇటీవలే తిరుమల విజిట్ చేసిన చిత్రాన్ని కూడా పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే టాలీవుడ్ మోస్ట్ బ్యూటిఫుల్ కపుల్స్ లో బన్నీ- స్నేహ జంట ఒకటి. వీరి పెళ్లి ఎప్పటికీ మరిచిపోలేనంతగా జరిగింది. 2011 మార్చి 6న వివాహ బంధంతో ఇద్దరూ ఒక్కటయ్యారు. చాలామంది సెలబ్రిటీల్లా అల్లు అర్జున్- స్నేహ జంటకు చిన్ననాటి పరిచయం లేదు. అమెరికాలో జరుగుతున్న ఒక శుభకార్యానికి బన్నీ వెళ్లారు. స్నేహా రెడ్డి కూడా సరిగ్గా ఆ వేడుకకు వచ్చారు. ఆ సమయంలో ఒక స్నేహితుడు బన్నీకి స్నేహను పరిచయం చేశాడు. ఇక తొలిచూపులోనే స్నేహతో ప్రేమలో పడ్డారు బన్నీ. ఆ విషయాన్ని మాత్రం ఆమెకు చెప్పలేదు. ఆ శుభకార్యం తర్వాత మళ్లీ వాళ్లిద్దరూ మాట్లాడుకుంది లేదు. కానీ బన్నీ మాత్రం స్నేహను మర్చిపోలేకపోయారు. ఆ తర్వాత కొన్నినెలలకు స్నేహకు ఒక మెసేజ్ చేశారు. అటు నుంచి కూడా స్పందన వచ్చింది. మళ్లీ ఒకసారి కలిసి మాట్లాడుకోవాలని అనుకున్నారు. అలా ఒకరి అభిప్రాయాలు ఒకరు అర్థం చేసుకునేందుకు పలుమార్లు కలిసి మాట్లాడుకుని ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు.

## ఇంగ్లండ్ కి చెందిన అపర కుబేరుడుని పెళ్లాడుతున్న ఎమీజాక్సన్



2.0- ఐ- ఎవడు- మద్రాసి పట్టణం వంటి చిత్రాలతో సౌత్ లో స్టార్ హీరోయిన్ గా వెలిగింది బ్రిటన్ కి చెందిన టాప్ మోడల్ కం నటి ఎమీజాక్సన్. ఈ భామ సౌత్ కెరీర్ ఫుల్ స్వింగ్ లో ఉండగానే అనూహ్యంగా సినిమాలను వదిలి ప్రేమలో పడింది . ఇంగ్లండ్ కి చెందిన అపర కుబేరుడు, బిలియనీర్ బిజినెస్ మ్యాగ్నెట్ జార్జి పనాయటౌతో కొన్నేళ్ల పాటు ప్రేమాయణం సాగించింది. అతడితో ఒక బిడ్డకు తల్లయిన ఎమీజాక్సన్ పెళ్లాడేందుకు ప్రయత్నించినా చివరికి వీలుపడలేదు. ఇంతలోనే వారి బ్రేకప్.. అటుపై ఎడ్ వెస్ట్ విక్ తో ఎమీ జాక్సన్ స్నేహం.. రిలేషన్ షిప్ వగైరా..కథనాలు వైరల్ అయ్యాయి. ఇప్పుడు తన ప్రియుడిని పెళ్లాడేందుకు ఎమీజాక్సన్ సిద్ధమైంది. ఎమీ ఎడ్ వెస్ట్‌విక్‌తో తన నిశ్చితార్థం జరిగిందని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎమీ తన సోషల్ మీడియాల్లో నిశ్చితార్థానికి సంబంధించిన వరుస ఫోటోలను షేర్ చేసింది. శ్రుతిహాసన్, కృతి సనన్, కియారా అద్వానీ, అథియా శెట్టి, ఓర్రి తదితరులు ఈ జంటకు అభినందనలు తెలిపారు. ఎమీ తన ఇన్‌స్టాగ్రామ్ లో 'హెల్.. అవును' అని రాసింది. ఎమీ షేర్ చేసిన ఫోటోలలో ఎడ్ ఒక మోకాలిపై కూచుని ఎమీకి ప్రపోజ్ చేయడంతో తను షాక్‌లో కనిపించింది. ప్రపోజల్ తర్వాత వీరిద్దరి సంతోషకరమైన ఫోటోలను కూడా షేర్ చేసింది. స్విట్జర్లాండ్‌లో మంచు పర్వతాల మధ్య అమీకి తన ప్రియుడు ఎడ్ ప్రపోజ్ చేసాడు.. కామెంట్ సెక్షన్ లో కియారా అద్వానీ అనేక హార్ట్ ఎమోజీలను పోస్ట్ చేసింది. కృతి సనన్ "ఓమ్! అభినందనలు ప్రేమ" అని వ్యాఖ్యానించగా, అతియా శెట్టి కూడా బ్లాక్ హార్ట్ ఎమోజితో అభినందనలు తెలిపింది. లిసా హేడన్ ఇలా రాసింది. "%ూఒషఒష% లవ్ కంగ్రాట్స్ అండ్ గ్లేసియర్ 3000" అని వ్యాఖ్యను జోడించింది. బాలీవుడ్ పార్టీలలో సందడి చేసే ఓర్రీ కూడా ఎమీజాక్సన్ కి శుభాకాంక్షలు తెలిపాడు. 'బిగ్గెస్ట్ కంగ్రాట్స్ ఏంజెల్ !!!' అని రాసాడు. శృతి హాసన్ కూడా రెడ్ హార్ట్ ఎమోజీలను పోస్ట్ చేసింది. స్నేహితులు, అభిమానులు ఎమీని పెద్ద ఎత్తున అభినందించారు. "అతిపెద్ద అభినందనలు దేవదూత !!!" అని రాసిన ఓర్రి "గాసిప్ గర్ల్‌లో చక్ బాస్‌గా ఎడ్ ఐకానిక్ పాత్రను ప్రస్తావిస్తూ చాలా మంది అభిమానులు వ్యాఖ్యానించారు. "చక్ చివరకు అతడి బ్లెయిర్‌ను కనుగొన్నాడు... అని పొగిడేశారు. ఒక వ్యక్తి ఇలా వ్యాఖ్యానించాడు. "సారీ?! నేను నా ఫోన్ తీసి కంగ్రాట్స్ చెప్పడానికి సిద్ధంగా లేను, మీరు ?"అని రాసారు. ఎమీ జాక్సన్- ఎడ్ వెస్ట్‌విక్ 2022లో ఇన్‌స్టాగ్రామ్‌లో తమ ప్రేమ గురించి పబ్లిక్ గా ప్రకటించారు. గత సంవత్సరం ఎడ్ పుట్టినరోజు సందర్భంగా ఎమీ ఒక స్వీట్ నోట్‌ను రాసింది. నేను ప్రతి రోజు మీ కోసం దేవునికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.. మీరు సంతోషంగా ఉండాలి నా ప్రేమ! అని రాసింది. ఎమీ జాక్సన్ తిరిగి భారతీయ సినిమాల్లో నటిస్తుందని ఇంతకుముందు కథనాలొచ్చాయి. కానీ తదుపరి ప్రాజెక్ట్ గురించి ఇంకా ఎలాంటి సమాచారం లేదు.

## బ్లాక్ చీరలో అందాల అషు

సోషల్ మీడియా ద్వారా జూనియర్ సమంత అంటూ గుర్తింపు దక్కించుకున్న అషు రెడ్డి ఆ తర్వాత బుల్లి తెర ద్వారా మరింతగా ప్రేక్షకులకు చేరువ అయ్యింది. బిగ్ బాస్ లో ఎంట్రీ ఇవ్వడం, వర్మ కంపెనీ అంటూ ముద్ర పడటంతో పాటు సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోల వల్ల హీరోయిన్ రేంజ్ గుర్తింపు దక్కింది. అషు రెడ్డి అందాల ఆరబోత ఫోటోలు రెగ్యులర్ గా సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసిన అషు రెడ్డి అందరి దృష్టిని



ఆకర్షిస్తోంది. ఈసారి అషు రెడ్డి చీర కట్టు ఫోటోలను షేర్ చేసింది. సాధారణంగానే అషు రెడ్డి ఫిజిక్ కి చీర కట్టు చాలా బాగా సెట్ అవుతుంది అంటూ నెటిజన్స్ మాట్లాడుకుంటూ ఉంటారు.

అలాంటిది ఇప్పుడు ట్రాన్సపరెంట్ చీర కట్టు లో అషు రెడ్డి వావ్ అనిపించేంత అందంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్ లో అందంగా ఉన్న అషు రెడ్డి కాస్త గట్టిగా ట్రై చేస్తే కచ్చితంగా సినిమాల్లో మంచి ఆఫర్లు వస్తాయి.

కానీ ఈ అమ్మడు మాత్రం ఎక్కువగా సినిమాలు చేయడం లేదు అంటూ కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలుగు లో కాకున్నా తమిళ్ లో అయినా ఈమె ఆఫర్ల కోసం ప్రయత్నిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## అమ్మడి అందాలకు ఎలాంటోడైనా పాగల్ అవ్వాల్సిందే..!

మోడల్ గా కెరీర్ ప్రారంభించి హీరోయిన్ గా మారిన తెలుగు అమ్మాయి సిమ్రన్ చౌదరి 2014లో వచ్చిన హం తుం సినిమాతో తెరంగేట్రం చేసినా 10 ఏళ్లలో ఆరు సినిమాలు మాత్రమే చేసింది. మోడలింగ్ తో పాటు సినిమాల మీద ఆసక్తితో ఈ రంగంలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు హం తుం మొదలు కుని ఈ నగరానికి ఏమైంది, బొంబాత్, చెక్, పాగల్, సెహరి సినిమాల్లో నటించింది. ఈ నగరానికి ఏమైంది, పాగల్ రెండు విశ్వక్ సేన్ సినిమాల్లో నటించి ఆడియన్స్ ని మెప్పించింది సిమ్రన్ చౌదరి. సినిమాల్లో తనకు ఇచ్చిన పాత్రల్లో మెప్పిస్తూ వస్తున్న అమ్మడికి స్టార్ ఛాన్స్ లు మాత్రం రావట్లేదు.



ఇక సినిమాల లెక్క ఎలా ఉన్నా సిమ్రన్ సోషల్ మీడియా హంగామా మాత్రం ఒక రేంజ్ లో కొనసాగుతుంది. తన క్రేజీ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని అలరిస్తుంది సిమ్రన్ చౌదరీ. లేటెస్ట్ గా తన లుక్స్ తో మరోసారి అందరినీ అలర్ట్ చేసింది. ఖాకీ కలర్ స్లీవ్ లెస్ డ్రెస్ తో గ్లామర్ డోస్ పెంచేసింది అమ్మడు. తన ఫాలోవర్స్ కు స్పెషల్ ట్రీట్ ఇచ్చేందుకు లేటెస్ట్ ఫోటో షూట్ తో క్రేజీ లుక్స్ తో అలరిస్తుంది సిమ్రన్. తనలోని ఈ హాలిలిట్ యాంగిల్ ఎవరు వాడుకోవట్లేదు కానీ ఇదే క్రేజీ అటెంప్ట్ సినిమాల్లో చేస్తే మాత్రం స్టార్ హీరోయిన్స్ కూడా సైడ్ అయ్యే రేంజ్ కి అమ్మడు వెళ్లడం గ్యారెంటీ. చేస్తున్న సినిమాలు.. సోషల్ మీడియా ఫాలోవర్స్ చాలకుని సైలెంట్ అవుతుంది కానీ అదే సిమ్రన్ రెచ్చిపోవడం మొదలు పెడితే తన తర్వాతే ఎవరైనా అన్న రేంజ్ లో ఉంది. చేసిన సినిమాలు తక్కువే అయినా సిమ్రన్ ని తెలుగు ప్రేక్షకులు అభిమానిస్తున్నారు.

అయితే ఆమె సినిమాల వేగం పెంచి మరిన్ని సినిమాలు చేస్తే ఆ క్రేజ్ డబుల్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. మరీ ముఖ్యంగా తనలోని ఈ గ్లామర్ యాంగిల్ సినిమాల్లో ట్రై చేస్తే మాత్రం నెక్స్ట్ బిగ్ స్టార్ అయినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. మరి సిమ్రన్ కావాలని సినిమాల్లో గ్లామర్ షో వద్దనుకుంటుందా లేదా అలాంటి ఆఫర్లు రావట్లేదా అన్నది తెలియదు కానీ సిమ్రన్ చౌదరి ఫాం లోకి వచ్చి వరుస సినిమాలు చేయాలని కోరుతున్నారు ఆమె ఫాలోవర్స్.

# క్రీడలతో నూతనోత్సాహం...

## తెలంగాణ రాష్ట్ర డీజీపీ రవి గుప్తా,ఐపీఎస్.

## ఘనంగా ముగిసిన ఆరవ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024.











సైబరాబాద్ (గరుడ వార్త) : సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో శనివారం సైబరాబాద్ ఆరవ యాన్యువల్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ 2024 ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ రవి గుప్తా, ఐపీఎస్., హాజరయ్యారు. ఈ క్రీడల్లో సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి, ఐపీ ఎస్., మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ ప్రాక్టీస్ నెట్, ఓపెన్ జిమ్ సెంటర్ ను తెలంగాణ రాష్ట్ర డీజీపీ రవి గుప్తా, ఐపీఎస్ ప్రారంభించారు. ముందుగా మహిళలు, పురుషులకు వేర్వేరుగా నిర్వహించిన 100 మీటర్ల పరుగు పందెం ను తెలంగాణ రాష్ట్ర డీజీపీ రవి గుప్తా,ఐపీఎస్., గాలిలోకి తుపాకీ కాల్చి పోటీలను ప్రారంభించారు. పురుషుల విభాగంలో రమేష్ పిసి సీఏఆర్ హెడ్ క్వార్టర్స్, మహిళల విభాగంలో రమాదేవి పిసి సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ గెలుపొందారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ రవి గుప్తా, ఐపీఎస్., మాట్లాడుతూ... డైనమిక్ పోలీస్ ఆఫీసర్ సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి, ఐపీఎస్., పిలుపు మేరకు సైబరాబాద్ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 లో పాల్గొనడం సంతోషంగ్గా ఉందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమిస్తున్న పోలీసులను అభినందించారు. ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించిన సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ను అభినందించారు. పోలీస్ సిబ్బంది బ్యాండ్ డిస్ప్లే మార్చ్ ఫాస్ట్ అసాధారణమైన విధంగా ఉందన్నారు. క్రీడలతో ఫిట్ గా ఉండొచ్చన్నారు. క్రీడల్లో గెలుపు కంటే పాల్గొనడం/ పార్టిసిపేషన్ ముఖ్యమన్నారు. పోలీసులు ఇదే స్ఫూర్తిని విధి నిర్వహణ లోనూ చూపించాలన్నారు. కష్టపడితేనే క్రీడల్లోనైనా, ఏ వృత్తిలోనైనా ఫలితం ఉంటుందన్నారు. పోలీసులు విధుల్లో ఒత్తిడి నుంచి బయటపడడానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. పోలీసులు శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. అనంతరం సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి, ఐపీఎస్ మాట్లాడుతూ... సైబరాబాద్ లో యాన్యువల్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ ఏర్పాటు చేయడం వరుసగా ఇది ఆరవ సారని అన్నారు. క్రీడలు నాయకత్వ లక్షణాలను తట్టి లేపడంతో పాటు టీమ్ స్పిరిట్, ఐకమత్యాన్ని పెంచుతాయన్నారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం తల మునకలై ఉన్నప్పటికీ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందన్నారు. పోలీసులు విధుల్లో ఒత్తిడి నుంచి బయటపడడానికి, శారీరక దృఢత్వాన్ని క్రీడలు తోడ్పడతాయన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలి, సిబ్బంది ఫిట్నెస్ ను కాపాడుకోవాలన్నారు. రెగ్యులర్ గా హెల్త్ చెక్ అప్స్ చేయించుకోవాలన్నారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు. రోజులో కొంత సమయాన్ని వ్యాయామం, యోగా కోసం కేటాయించుకోవాలన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ క్రీడల్లో పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. మొత్తంగా 33 ఈవెంట్స్ లో 9 టీమ్ లు 1)మాదాపూర్ జోన్, 2)బాలానగర్ జోన్, 3)శంషాబాద్ జోన్, 4) రాజేంద్రనగర్ జోన్ 5)మేడ్చల్ జోన్ 6) సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ 7) ట్రాఫిక్ వింగ్ 8) క్రైమ్ వింగ్ 9) మినిస్టీరియల్ స్టాఫ్ పాల్గొన్నారన్నారు. పోలీస్ సిబ్బందికి కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్, టెన్నిస్ తదితర పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐపీఎస్., ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ రవి గుప్తా, ఐపీఆఎస్., గారిని సత్కరించారు. పోలీస్ అధికారులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్, డ్రిల్ అందరినీ ఆకర్షించింది. చివరగా బాలానగర్ డీసీపీ టి. శ్రీనివాస్ రావు, ఐపీఎస్., వోట్ ఆఫ్ థాంక్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐపీఎస్., మాదాపూర్ డీసీపీ డా. జి. వినీత్, ఐపీఎస్., మేడ్చల్ డీసీపీ నితికా పంత్, ఐపీఎస్., శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, ఐపీఎస్., బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, ఐపీఎస్., రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, ఐపీఎస్., డీసీపీ సైబర్ క్రైమ్స్ కె. శిల్పవల్లి, డీసీపీ %జూాఔ% కె. ప్రసాద్, ఉమెన్ %డ% చైల్డ్ సేఫ్టీ డీసీపీ సృజన కర్ణం, డీసీపీ ఎస్బీ జే అశోక్ కుమార్, సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ నర్సింహా కొత్తపల్లి, ఎలక్షన్ సెల్ డీసీపీ అశోక్ కుమార్, మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ డివి శ్రీనివాసరావు, ఐపీఎస్., డీసీపీ అడ్మిన్ రవి చందన్ రెడ్డి, డీసీపీ రోడ్ సేఫ్టీ %ూజ% నాయక్, మాదాపూర్ డీసీపీ ఎస్ఓటిల రషీద్, మేడ్చల్ ఎస్ఓటిక డీసీపీ డి. శ్రీనివాస్, డీసీపీ రఘువీర్, ఆపరేషన్స్ విశ్వజిత్, ఐపీఎస్., ఏడీసీపీ ఎస్‌బి రవి కుమార్, ఏడీసీపీ మేడ్చల్ ఎస్‌బి శ్రీనివాసరావు, ఏడీసీపీ మాదాపూర్ ఎన్. నరసింహ రెడ్డి, ఏడీసీపీ బాలానగర్ సత్యనారాయణ, ఏడీసీపీ రాజేంద్రనగర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్., సిఎంసి ఏడిసిపి శ్రీనివాసరావు, ఏడీసీపీ శంషాబాద్ కె. రామ్ కుమార్, ఏడీసీపీ ట్రాఫిక్ శ్రీనివాసరెడ్డి, ఏడీసీపీ ట్రాఫిక్ మేడ్చల్ వేణు గోపాల్ రెడ్డి, ఏడీసీపీ సిటిసి రామచంద్రుడు, ఎడిసిపి సిసిఎస్ జి నరసింహారెడ్డి, ఎడిసిపి ఎస్ఒటి-%I% పి. నారాయణ, ఎడిసిపి ఎస్ఒటి-%II% పి. శోభన్ కుమార్, ఏడీసీపీ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ జె ఎస్‌కె షమీర్, ఎడిసిపి సిఎస్‌డబ్ల్యు వెంకట్ రెడ్డి, ఎడిసిపి సిఎఆర్ శంకర్ నాయక్, ఏడీసీపీ సిఎఆర్ కరుణాకర్, ఏడీసీపీ సిఎస్‌డబ్ల్యు డి. శ్రీనివాస్ రావు, ఏడీసీపీ చీఫ్ మార్షల్ సంజీవ్ రెడ్డి, ఇతర ఏడీసీపీలు, ఏసీపీలు, సీఏవో అకౌంట్స్ చంద్రకళ, సీఏవో అడ్మిన్ గీత, ఇన్‌స్పెక్టర్లు, మినిస్టీరియల్ స్టాఫ్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డితో మేయర్ విజయలక్ష్మి భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 3: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మేయర్ గద్వాల విజయలక్ష్మి శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో అభివృద్ధి పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సీఎంకు మేయర్ వినతి చేశారు.



స్టాండింగ్ కమిటీ ఏర్పాటు, కౌన్సిల్ సమావేశం, బల్దియా ఆర్థిక పరిస్థితిపై రేవంత్‌తో చర్చించారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవడంతో ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు హైకోర్టుకు వెళ్ళినట్లు సీఎం దృష్టికి మేయర్ తీసుకెళ్లారు. కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించేలా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఆదేశాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని మేయర్ విజయలక్ష్మి కోరారు.

## సీఎం రేవంత్, కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ కవిత సంచలన కామెంట్స్

హైదరాబాద్: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సెటైరికల్ కామెంట్స్ చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు పార్టీ నాయకులను ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. పార్టీ సభ కోసం ప్రభుత్వ నిధులను ఎలా ఖర్చు చేస్తారు. 60 రోజుల్లో కాంగ్రెస్ చేసింది ఏమిటి? అని డిమాండ్ చేశారు. కాగా, ఎమ్మెల్సీ కవిత తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'కాంగ్రెస్ పార్టీ నాయకులు నా మీద, జాగృతిపైనా ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారు. ఇంద్రవెల్లి సభలో సీఎం రేవంత్ రెడ్డి అనేక ఆరోపణలు నాపై చేశాడు. పార్టీ సభకు ప్రభుత్వ నిధులు ఎందుకు వాడుతున్నారు. అధికారికంగా హెలికాప్టర్ వేసుకొని వెళ్లి పార్టీ సభ పెట్టారు. ప్రభుత్వ కార్యక్రమానికి ప్రియాంక గాంధీని ఎలా పిలుస్తారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రియాంక గాంధీని పిలిస్తే నిరసన తెలియజేస్తాం. వేదిక, కుర్చీలు, లైట్లు పెట్టినందుకు ప్రభుత్వానికి లెక్కలు చెప్పారా?. ఇంద్రవెల్లి సభకు అయిన ఖర్చు ఎంత?. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారు. సీఎం రేవంత్ నిత్యం ఢిల్లీకి ప్రత్యేక విమానం, చార్టెడ్ ఫ్లైట్స్‌లో వెళ్తున్నారు. ఇదంతా ప్రభుత్వ ఖర్చుతోనే వెళ్తున్నారు కదా?. జై సోనియా అంటున్నారు కానీ.. జై తెలంగాణ అనే మాట రేవంత్ రెడ్డి నోటి నుంచి రాలేదు. కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారు. సీఎం సోదరులు జిల్లా రివ్యూల్లో ఎలా పాల్గొంటారు. 60 రోజుల్లో ఒకే ఒకరోజు ప్రజాదర్బార్‌లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజలు రేవంత్ రెడ్డిని యూటర్న్ సీఎం అని పిలుస్తున్నారు. మలి దశ ఉద్యమంలో అమరులైన అమరులకు కుటుంబాలకు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి. సీఎం రేవంత్ ఒక్కరోజు కూడా అమరులకు నివాళులు అర్పించలేదు. ఒక్క అమరవీరుడి కుటుంబాన్ని కూడా పరామర్శించలేదు. మాది కుటుంబ పార్టీ అంటున్న రేవంత్, కాంగ్రెస్ నేతలు.. హస్తం పార్టీలోని 22 కుటుంబాలకు ఎమ్మెల్యే టికెట్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు, వారి కుటుంబ సభ్యుల వివరాలను చదివి వినిపించారు.

## బీజేపీని అడ్డుకునే శక్తి వారికి మాత్రమే ఉంది: కేటీఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీని ఆపగలిగే శక్తి కేవలం బలమైన ప్రాంతీయ రాజకీయ శక్తులకే ఉందన్నారు మాజీ మంత్రి కేటీఆర్. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి వల్లే ఇండియా కూటమి చెల్లాచెదురవుతోందని దుయ్యబట్టారు. ఇది, బీజేపీకే లాభం అంటూ కామెంట్స్ చేశారు. కాగా, తాజాగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యలపై కేటీఆర్ ?స్పందించారు. ఈ సందర్భంగా ట్విట్టర్ వేదికగా కేటీఆర్..'కాంగ్రెస్ పార్టీకి దబ్బుంటే వారణాసిలో పోటీ చేసి గెలవాలని, కాంగ్రెస్ పార్టీ తనకున్న 40 స్థానాలను కూడా ఈసారి నిలబెట్టుకునే అవకాశం లేదంటూ కాంగ్రెస్ పార్టీపై మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి వల్లనే ఇండియా కూటమి చెల్లాచెదురు అవుతోంది. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఆత్మ పరిశీలన చేసుకోవాలి.



## అవార్డులను అమ్ముకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీది: బండి సంజయ్



కరీంనగర్: బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్‌కే అద్వానీకి భారతరత్న ఇవ్వడంపై ఎంపీ బండి సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. అద్వానీకి భారతరత్న ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీపై దేశద్రోహం పెట్టాలని డిమాండ్ చేశారు.

కాగా, బండి సంజయ్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'దేశంలో ఎమర్జెన్సీ, అయోధ్య పోరాటంలో పాల్గొన్న అద్వానీకి భారతరత్న ఇవ్వడం సంతోషంగా ఉంది. అన్ని సర్వేల్లో బీజేపీ, ప్రధాని మోదీనే మళ్లీ గెలుస్తారు అని రిపోర్టులు రావడం చూసి బీఆర్ఎస్ నాయకులు కంగారు పడుతున్నారు. బీఆర్ఎస్ ఎంపీ ఎన్నికల కోసం చేసిన సర్వే రిపోర్టు నా దగ్గరకి వచ్చింది. కాంగ్రెస్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి. దేశాన్ని విభజించాలి అంటూ కాంగ్రెస్ ఎంపీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. టెర్రరిస్టులు, ఉగ్రవాదులు చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేతలు సపోర్టు చేస్తున్నారు.

ఇండియా కూటమి విచ్చినం అవుతుందన్న ఆందోళనతో వారు ఇలాంటి పిచ్చి కామెంట్స్ చేస్తున్నారు. రాజీవ్ గాంధీ కూడా ఇలా మాట్లాడిన చరిత్ర ఉంది. అవార్డులను అమ్ముకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీది. కాంగ్రెస్ హయాంలో పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులు కావాలంటే డబ్బులు ఇస్తే వచ్చేవి. కానీ, సమాజంలో నిజమైన అర్హులకు మాత్రమే బీజేపీ అవార్డులను ఇస్తోంది' అంటూ కామెంట్స్ చేశారు.

## చెల్లిపై అలాంటి పోస్టర్లు వస్తే జగన్ స్పందించరా?



హైదరాబాద్ : "షర్మిల రాజశేఖర్ రెడ్డి కూతురు కాదు" అని ఆరోపణలు చేస్తూ వచ్చిన పోస్టర్లపై కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... తల్లిని, చెల్లిని జగన్ దూరం పెట్టారని.. సొంత చెల్లికి అవమానం జరుగుతుంటే జగన్‌కు బాధ్యత లేదా అని ప్రశ్నించారు. షర్మిల, సునీతలపై జగన్‌కు గౌరవం లేదన్నారు. సొంత చెల్లెళ్ళపై ప్రేమ లేని జగన్ మహిళా సాధికారత అని ముచ్చట్లు చెబుతారని మండిపడ్డారు. షర్మిల రాజశేఖర్ రెడ్డి కూతురు కాదని ఆరోపణలు చేస్తూ పోస్టర్స్ వేస్తుంటే జగన్ సైలెంట్ ఉండడం ఏంటి అని నిలదీశారు. జగన్ జైల్లో ఉన్నప్పుడు షర్మిల అన్నకి సపోర్ట్ చేశారని.. రాజకీయాల కోసం జగన్ ఇంత దిగజారుతారా అంటూ విమర్శించారు. షర్మిలపై ఇలాంటి పోస్టర్స్ వేస్తుంటే బాధగా ఉందన్నారు. ఇప్పటికైనా చెడు సంప్రదాయాలని జగన్ పక్కన పెట్టాలని హితవుపలికారు. పవర్ ఉందని జగన్ ఎగిరెగిరి పడితే ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## బలపరీక్షకు హాజరుకానున్న హేమంత్ సోరెన్... కోర్టు అనుమతి

రాంచీ: అనూహ్య పరిణామాల మధ్య జారా?ండ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఈడీ అరెస్టుతో బిర్సా ముండా జైలులో ఉన్న హేమంత్ సోరెన్‌కు ఊరట లభించింది. జేఎంఎం కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంపయి సోరెన్ ఈనెల 5న అసెంబ్లీలో బలనిరూపణ చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగే ఓటింగ్‌కు హాజరయ్యేందుకు హేమంత్ సోరెన్‌ను రాంచీ ప్రత్యేక కోర్టు అనుమతించింది. ప్రభుత్వ బలపరీక్షలో పాల్గొనేందుకు తనను అనుమతించాలంటూ హేమంత్ సోరెన్ దాఖలు చేసిన పిటిషన్‌పై శనివారంనాడు విచారణ సందర్భంగా ఈడీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిని హేమంత్ సోరెన్ తరఫున వాదిస్తున్న అడ్వకేట్ జనరల్ తప్పుపట్టారు. హేమంత్ సోరెన్‌ను అనుమతించరాదన్న ఈడీ చర్య వెనుక ప్రభుత్వాన్ని కుప్పకూల్చడమే ప్రధాన ఉద్దేశం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందన్నారు. ఓటింగ్‌కు ఒక ఎమ్మెల్యేను హాజరుకాకుండా చేయడం ద్వారా ప్రభుత్వాన్ని దించాలనుకుంటోందన్నారు.

ఈ ప్రక్రియ మొత్తం అప్రతిష్టపాలు చేసేందుకు ఉద్దేశించినదేనని తాము మొదట్నించీ చెబుతూనే ఉన్నామని అన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న ప్రత్యేక కోర్టు ప్రభుత్వ బలపరీక్షలో పాల్గొనేందుకు హేమంత్ సోరెన్‌ను అనుమతిస్తున్నట్టు ప్రకటించింది. ఫిబ్రవరి 5వ తేదీ ఉదయం 11 గంటలకు ఫ్లోర్ టెస్ట్ మొదలై, ఓటింగ్ ముగిసేంత వరకూ హేమంత్‌ను అనుమతిస్తున్నట్టు తెలిపింది.

**బలాబలాలు :** జార్ఖండ్ అసెంబ్లీలో 81 మంది సభ్యులు ఉండగా, జారా?ండ్ ముక్తి మోర్చాకు 29 మంది సభ్యుల బలం ఉంది. జేఎంఎం భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌కు 17, ఆర్జేడీ, సీపీఐఎంఎల్‌కు ఒక్కో సభ్యుడు ఉన్నారు. మెజారిటీకి 41 మంది ఎమ్మెల్యేల బలం కావాలి. జేఎంపీ కూటమి తమకు 43 మంది ఎమ్మెల్యేల మద్దతున్నట్టు ప్రకటించింది.




## కారు దిగిన రాజయ్య.. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా

జనగామ: స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య భారాసను వీడారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ఈ మేరకు లేఖను మీడియాకు చూపించారు. ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతకుముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "భారాసలో మానసిక క్షోభకు గురయ్యా. పార్టీలో నాకు సరైన గుర్తింపు లభించడం లేదు. పార్టీ అధినాయకత్వాన్ని కలిసే అవకాశమే దక్కడం లేదు. కార్యకర్తల నుంచి ఒత్తిడి ఉంది. వారితో చర్చించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటా. పార్టీ విధివిధానాలు నచ్చట్లేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామనడం సరికాదు. నేను 15 ఏళ్లు కాంగ్రెస్‌లోనే ఉన్నాను. కాంగ్రెస్‌లో ఉండి తెలంగాణ కోసం పోరాడా" అని చెప్పారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com